


చైనా వెల్లుల్లి..!

2014లో నిషేధించిన కేంద్రం

- అక్రమంగా దిగుమతి
- విచ్చలవిడిగా విక్రయాలు
- పట్టించుకోని అధికారులు
- ప్రమాదకరమంటున్న వైద్యులు



కదిరి అర్బన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మన వంటకాల్లో వెల్లుల్లిది అగ్రస్థానం. ప్రతి మసాలా కూరకు దీనిని వాడతారు. ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే వెల్లుల్లిని దాదాపు ప్రతి ఇంటిలోనూ వినియోగిస్తారు. దీని వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. గుండె సంబంధమైన రుగ్మతలకు వెల్లుల్లి మంచి నివారణగా చెబుతారు. ప్రస్తుతం మార్కెట్‌లో వెల్లుల్లి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. మన ప్రాంతంలో వెల్లుల్లి కొరత ఎక్కువగా ఉంటుంది. దీంతో ధరలు అధికంగానే ఉంటాయి. ఇటీవల చైనా వెల్లుల్లి రూపంలో ప్రమాదకరమైన విషం మార్కెట్‌లో హల్ చల్ చేస్తోంది. దీంతో కిలో రూ.400 వరకు పలికిన వెల్లుల్లి ధరలు ప్రస్తుతం రూ.150 నుంచి రూ. 200 పడిపోయాయి.

అక్రమంగా దిగుమతి

నకిలీ వస్తువులు తయారు చేయడంలో చైనా దేశం మొదటి స్థానంలో ఉంటుంది. ఐ ఫోన్ నుంచి ఆట బొమ్మల వరకు ప్రతిదీ తయారు చేస్తుంది. వాటిలో నాణ్యత ప్రమాణాలు ఉండవు. ఇదే కోవకు చెందినదే చైనా వెల్లుల్లి. అది పండించే పంటలు కూడా నాసిరంగానే ఉంటాయి. అలాంటి ఓ నాసిరకమైన ఉత్పత్తి చైనా వెల్లుల్లి. దీన్ని తినడం ద్వారా మనిషి ఆరోగ్యంగా ఉన్నట్లు కనిపించినా, లోపల అనేక సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉన్నట్లు ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. గ్యాస్ట్రిక్, జీర్ణశక్తి లోపించడం, మూత్రపిండాలు చెడిపోవడం లాంటి సమస్యలు వచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది. మనదేశంలో వెల్లుల్లిని సహజంగా పండిస్తారు. ఎక్కువగా పురుగు మందులు వాడరు. చైనీస్ వెల్లుల్లిని త్వరగా మార్కెట్‌లోకి తీసుకురావడానికి ఎక్కువగా పురుగు మందులు వినియోగిస్తారు.

కేంద్రం నిషేధించినా..

చైనా వెల్లుల్లి కారణంగా ప్రజలకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయని పసిగట్టిన కేంద్ర ప్రభుత్వం 2014లోనే వీటిని మన దేశంలో నిషేధించింది. హానికరమైన రసాయనాలను ఉపయోగించి, కృత్రిమంగా తయారు చేసిన వెల్లుల్లి మనిషి ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తుందని ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన మోతీలాల్‌యాదవ్ అనే న్యాయవాది అలహాబాద్ హైకోర్టులో పిల్ వేశారు. దీనిపై విచారించిన న్యాయమూర్తి దేశంలో వీటిని అమ్మరాదని, నిషేధం విధించాలని కేంద్రానికి సూచించారు. దీంతో 2014 నుంచి దేశంలో చైనా వెల్లుల్లి అమ్మకాలపై నిషేధం కొనసాగుతోంది.

ఆరోగ్యానికి హానికరం


చైనా వెల్లుల్లి చూడడానికి చాలా తెల్లగా, బలంగా కనిపించినా ఆరోగ్యానికి హానికరం. ఈ వెల్లుల్లిలో మిథైల్‌బ్రోమైడ్ రసాయనాలు వాడుతున్నట్లు కొన్ని పరిశోధనల్లో వెల్లడైనట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ రసాయనం శరీరంలోకి ప్రవేశిస్తే కాలేయం, మూత్రపిండాలు దెబ్బతినడంతోపాటు దృష్టిలోపం కూడా వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. టాక్సిన్స్ వల్ల పొట్టలో పుండ్లు, పొత్తి కడుపు నొప్పి, శ్వాస ఆడకపోవడం, తలనొప్పి వంటి సమస్యలు వచ్చే అవకాశముంది. వీటిని అతిగా ఉపయోగించడం వల్ల దీర్ఘకాలంలో నపుంసకత్వం, క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుందని చెబుతున్నారు. తెల్లదనం పెంచడానికి క్లోరిన్ అనే రసాయనంతో శుభ్రం చేస్తారు. అందుకే అవి ఎప్పుడూ తెల్లగా, అందంగా కనిపిస్తాయి. జన్యు మార్పిడి రకం కావడంతో ఇందులోని ఫంగస్ కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని చెబుతున్నారు.

గుర్తించడం ఎలా..?

చైనా రకం వెల్లుల్లిని సులభంగా గుర్తించవచ్చు. వీటి పాయలు చాలా తెల్లగా, లావుగా కనిపిస్తాయి. పసుపు మచ్చలు, పుచ్చులు ఉండవు. సాధారణ వెల్లుల్లికంటే చైనీస్ వెల్లుల్లి పెద్దగా ఉంటుంది. రెబ్బలు మందంగా ఉంటాయి. స్థానిక దేశీయ వెల్లుల్లి సాధారణ పరిమాణంలో ఉంటూ.. రెబ్బలు సన్నగా ఉంటాయి. సహజంగా పండించిన వెల్లుల్లి పొట్టు తీయడం కష్టం. వాసన ఘాటుగా ఉంటుంది. చైనీ వెల్లుల్లి ఘాటు తక్కువగా ఉంటుంది.

తక్కువ ధరకే..

ప్రస్తుతం దేశీయ వెల్లుల్లి కిలో రూ.350 నుంచి రూ.400 ధర పలుకుతోంది. దీన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది వ్యాపారులు చైనా నుంచి అక్రమంగా వెల్లుల్లిని దిగుమతి చేసుకుంటున్నారు. చెన్నై, బెంగుళూరు మార్కెట్ల నుంచి ఎక్కువగా చైనా వెల్లుల్లి మన మార్కెట్‌ల్లోకి చేరుతోంది. కిలో రూ.150 నుంచి రూ.200 ధరలు అమ్ముతుండడంతో ప్రజలు ఎక్కువగా వీటిని కొనుగోలు చేయడానికి మొగ్గు చూపుతున్నారు.



చైనా వెల్లుల్లి

పట్టించుకోని అధికారులు

నిషేధిత చైనా వెల్లుల్లిని మార్కెట్లో విచ్చలవిడిగా విక్రయిస్తున్నా ఫుడ్‌సేఫ్టీ అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు ఉన్నాయి. నిషేధం ఉన్నప్పటికీ ఇది ఎక్కడి నుంచి మన ప్రాంతానికి చేరుతోంది అన్న సమాచారం కూడా వీరికి తెలియకపోవడం విడ్డూరం. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు హానికరమైన చైనా వెల్లుల్లి అమ్మకాలను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చర్యలు తీసుకుంటాం..

చైనా వెల్లుల్లి మన ప్రాంతానికి ఎక్కడి నుంచి వస్తున్నదో ఆరా తీస్తాం. వీటి సరఫరాపై నిఘా పెడతాం. నిషేధిత వెల్లుల్లి విక్రయాలపై చర్యలు తీసుకుంటాం. వినియోగదారులు కూడా వీటిపై అప్రమత్తంగా ఉండాలి. దేశవాళీ వెల్లుల్లి వాడకమే ఆరోగ్యానికి శ్రేయస్కరం.

-రామచంద్ర, ఫుడ్‌సేఫ్టీ అధికారి, పుట్టపర్తి



ఆరోగ్యానికి హానికరం

వెల్లుల్లి సాగులో చైనా అపరిశుభ్రమైన సాగు పద్ధతులను అవలంబిస్తున్నట్లు తెలుస్తోంది. సెప్టిక్ ట్యాంక్ నుంచి వచ్చిన నీటిని ఈ పంటకు వినియోగిస్తారు. పంట ఉత్పత్తిలో విపరీతంగా రసాయనాలను ఉపయోగిస్తారు. శ్వాస, నాడీ వ్యవస్థలపై తీవ్ర ప్రభావం ఉంటుంది. గతంలో అమెరికాలో కూడా దీనిపై చర్చ జరిగింది. మనదేశంలో వెల్లుల్లి ధరలు పెరగడంతో ప్రపంచంలో అత్యధికంగా వెల్లుల్లి పండించే చైనా నుంచి అక్రమ మార్గంలో దిగుమతి చేసుకుంటున్నారు. ఎక్కువ కాలం నిలువ ఉండడానికి మిథైన్ బ్రోమైడ్ అనే రసాయాన్ని వాడతారు. తెల్లగా ఉండడానికి క్లోరిన్‌తో బ్లీచింగ్ చేస్తారు. ఇది చాలా ప్రమాదకరం. వీటితో దీర్ఘకాలిక సమస్యలు తప్పవు.



-డాక్టర్ సీవీ మదన్‌కుమార్, చిన్నపిల్లల వైద్యుడు

ఈ-శ్రమ్ పోర్టల్లో చేర్చండి

- కలెక్టర్ టీఎస్ చేతన్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిటౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అసంఘటిత కార్మికులందరిని ఈ-శ్రమ్ పోర్టల్లో నమోదు చేయించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో జిల్లాస్థాయి ట్రాస్క్‌ఫోర్స్ కమిటీ, సమన్వయ కమిటీతో మంగళవారం ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెండు లక్షల మంది అసంఘటిత కార్మికులున్నారని, వీరందరిని ఈ-శ్రమ్ పోర్టల్‌లో చేర్పించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా వ్యవసాయ అనుబంధ రంగాల్లోని చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, తాపీ మేస్త్రీలు, ఎలక్ట్రీషియన్లు, రిక్షా కార్మికులు, ఇటుకల బట్టీల్లో పనిచేసే కూలీలు, టైల్స్ పనివారు, భవన నిర్మాణ కార్మికులు, టైలరింగ్, ఎంబ్రాయిడింగ్, కుమ్మరి, కమ్మరి, స్వర్ణకారులు, తోపుడుబండ్ల వ్యాపారులు తదితరులను ఈపోర్టల్‌లో నమోదు చేయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఉపాధిలో పనిచేసే కార్మికులను ఇందులో చేర్పించాలన్నారు. చేనేత కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలను కూడా చేర్పించాలన్నారు. ఈపోర్టల్‌లో నమోదు చేసుకున్న ప్రతిఒకరికీ యూనివర్సల్ అకౌంట్ నెంబర్ కార్డు జారీ చేస్తారని, ఈకార్డు ఉంటేనే ప్రభుత్వ సామాజిక భద్రత సంక్షేమపథకాలు వర్తిస్తాయన్నారు. ఇందులో నమోదైన ప్రతి కార్మికుడికి ఏడాదిపాటు ప్రధానమంత్రి సుర క్షిత బీమాప్రయెజనాలు అందుతాయన్నారు. ఈపథకంపై అసంఘటిత కార్మికులకు అవగాహ కల్పించడానికి హెచ్‌ఓడీలు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్మిక శాఖాధికారి సూర్యనారాయణ, వ్యవసాయశాఖ అధికారి సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజు, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, గ్రామ, వార్డు సచివాలయ నోడల్ అధికారి సుధాకర్ రెడ్డి తదితరులున్నారు.

హైవే నిర్మాణాల పరిశీలన

జిల్లాలో నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారులను కలెక్టర్ టీఎస్ చేతన్ మంగళవారం పరిశీలించారు. గోరంట్ల వద్ద ఎన్‌హెచ్716, పుట్టపర్తి కోడూరు 342, కదిరి, కుటాగుళ్ల వద్ద ఆర్వోబీ రహదారి నిర్మాణాలు పరిశీలించారు. ఎన్‌హెచ్ అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. రహదారులకు భూసేకరణ సమస్యలు పరిష్కరించాలని జెసి అభిషేక్ కుమార్‌కు సూచించారు.

నేడు పుట్టపర్తికి 20సూత్రాల అమలు కమిటీ చైర్మన్ రాక

20సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకాదినకర్ బుధవారం పుట్టపర్తికి రానున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ మంగళవారం ఓప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని ప్రజాసమస్యల పరిష్కార వేదిక సమావేశ భవనంలో బుధవారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు 20 సూత్రాల అమలుపై అధికారులతో సమీక్షిస్తారన్నారు. సమావేశానికి ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు హాజరవుతారన్నారు.



అభివృద్ధి ఎలా..?

- మున్సిపాల్టీలో వసూలు కాని పన్నులు
- రూ.17 కోట్లకుపైగా పేరుకుపోయిన బకాయిలు
- వసూళ్లలో అధికారుల అలసత్వం
- కుంటుపడుతున్న పట్టణ అభివృద్ధి

ధర్మవరం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పన్ను వసూళ్లలో అధికారుల అలసత్వం కారణంగా బకాయిలు పేరుకుపోయాయి. దీంతో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయి. మున్సిపాలిటీలో 40 వార్డులు ఉన్నాయి. 39వేల కుటుంబాలు, 1.5లక్ష దాకా జనాభా ఉంది. ఇంత జనాభా ఉన్న పట్టణంలో పారిశుధ్యం నిర్వహించా లన్నా, తాగునీరు సరఫరా చేయాలన్నా, రోడ్లు, వీధి దీపాలు వంటి పనులు చేయాలన్నా నిధులు చాలా అవసరం. ఇవి ప్రజలు చెల్లించే పన్నులతోనే సమకూరుతాయి. అయితే పన్నులు సకాలంలో వసూళ్లు కాకుంటే అభివృద్ధి ఏమో గానీ కనీసం ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి కూడా ఉండదు. ఈ స్థితి రాకుండా ఉండాలంటే మున్సిపల్ సిబ్బంది సకాలంలో పన్ను వసూలు చేయల్సి ఉంటుంది.

పేరుకుపోయిన బకాయిలు

పట్టణంలో మున్సిపల్ అధికారుల అలసత్వంతో పలు రకాల పన్నుల బకాయిలు పేరుకుపోయాయి. ఆస్తి పన్ను బకాయిలు రూ.17.76 కోట్లుపైబడి ఉండగా రూ.6.58 కోట్లు వసూలు చేశారు. ఇంకా రూ.11కోట్లకు పైబడి బకాయిలు ఉన్నాయి. అదేవిధంగా నీటి పన్ను రూ.9.35 కోట్లకు గాను రూ.3.05 కోట్లు వసూలైంది. ఇంకా దాదాపు రూ.6.3 కోట్ల బకాయిలు ఉన్నాయి. మొత్తంగా రూ.17కోట్లకు పైబడి బకాయిలు ఉన్నాయి. అదేవిధంగా లక్షకు పైగా పన్ను చెల్లించాల్సిన వారు 37 మంది ఉన్నారు. బకాయిలు భారీగా ఉన్న వారికి రెడ్ నోటీసులు జారీ చేశారు. 15 రోజుల్లోపు నోటీసులకు స్పందించకపోతే వారి ఆస్తులు సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

సచివాలయ ఉద్యోగుల అలసత్వం

మున్సిపాలిటీలో 40 వార్డు సచివాలయాలు ఉండగా 520 మంది వరకు ఉద్యోగులు పని చేస్తున్నారు. ఇంత మంది సచివాలయ సిబ్బంది ఉన్నా ఇంటి, నీటి పన్నుల బకాయిలు పేరుకుపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మున్సిపల్ రెవెన్యూ, అధికారులతో పాటు కమిషనర్ వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్ పెట్టాలని పలువురు కోరుతున్నారు. మార్చి 31తో 2024-25 ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో పట్టుదలగా వసూలు చేస్తే తప్ప ఈ ఏడాదికి సంబంధించిన పన్నులు వసూలు కావు. అయితే పన్ను బకాయిదారులు మాత్రం బకాయి మీద ఉన్న వడ్డీని మార్చిలో మాఫీ చేస్తారని ఎదురుచూస్తున్నారు. కానీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి రీత్యా వడ్డీ మాఫీ ఉండకపోవచ్చని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.

స్పెషల్ డ్రైవ్



మున్సిపాలిటీలో ఇంటి, నీటి పన్నులతో పాటు వాణిజ్య గదుల అద్దె వసూళ్ల కోసం సచివాలయ సిబ్బందితో పాటు రెవెన్యూ అధికారులు స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొంటున్నారు. ప్రతి రోజు వసూళ్లకు టార్గెట్ ఇచ్చాం. మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేశాం. త్వరలో ఆస్తుల జప్తు చేసే చర్యలు చేపట్టబోతున్నాం. నీటి పన్ను చెల్లించకుంటే కొళాయి కనెక్షన్ కూడా తొలగిస్తాం.

-ప్రమోద్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

హత్యా..? 7 ఆత్మహత్యా..?



ఇంటర్ విద్యార్థి అనుమానాస్పద మృతి

ఉరికి వేలాడిన ఎస్‌ఆర్ కాలేజీ విద్యార్థి

మహిళలు.. రథచక్రాలు

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి: ఎస్పీ రత్న

విద్యతోనే మహిళలకు అవకాశాలు: ఎమ్మెల్యే సింధూరారెడ్డి



సదస్సులో ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్పీ రత్న, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఆధునిక యుగంలో ప్రతి రంగంలో మహిళలు విశేషంగా రాణిస్తున్నారని ఎస్పీ రత్న అన్నారు. మహిళలు సమాజానికి రథచక్రాలని అన్నారు. పెడపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 'మహిళల భద్రత-భవిష్యత్తుకు భరోసా' పేరుతో మంగళవారం సదస్సు నిర్వహించారు. బాలికలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, బాల్యవివాహాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు ప్రతి నియోజకవర్గంలో వచ్చేనెల 15 వరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని ఎస్పీ అన్నారు. మహిళల భద్రత భవిష్యత్తుకు భరోసా ఇవ్వాల్సింది కుటుంబం, సమాజమేనన్నారు. బాలికలే కాదు, బాలురపై కూడా నేరాలు జరుగుతున్నాయని ఎస్పీ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఇటీవల ఇద్దరు మహిళలపై జరిగిన గ్యాంగ్‌రేప్ తనను తీవ్రంగా కలచి వేసిందన్నారు. విద్యతోనే మహిళలకు అన్నిరంగాల్లో అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి అన్నారు. ప్రస్తుతం అన్నిరంగాల్లో మహిళలు రాణిస్తున్నారన్నారు. అనంతరం విద్యార్థినులు కళాకారులు, ప్రదర్శించిన నాటికలు, ఆలపించిన గీతాలు మహిళల్లో చైతన్యం నింపాయి. పెనుకొండ జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థినులు ప్రదర్శించిన దేవకీ కల్యాణం నాటిక కన్నీళ్లు పెట్టించింది. కార్యక్రమంలో సర్పంచ్ మంగ్లీబాయి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఫైరోజ్‌బేగం, ఐసీడీఎస్ పీడీ వరలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఆర్డీఓ సువర్ణ, డీఎస్పీ విజయ్‌కుమార్, మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ ఆదినారాయణ పాల్గొన్నారు.

విశ్వశాంతి కోసం.. యజ్ఞం



యజ్ఞం నిర్వహిస్తున్న రుత్వికులు

పుట్టపర్తి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): విశ్వశాంతి, లోకసంరక్షణ కోసం చేపట్టిన అతిరుద్ర మహాయజ్ఞం మంగళవారం కూడా కొనసాగింది. ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంతులో ఐదో రోజు వేదపండితులు గణపతి పూజతో హోమాలు ప్రారంభించి లింగాభిషేకం, సర్వదేవతా అర్చన చేపట్టారు. యజ్ఞంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. పట్టణంలోని హనుమాన్ సర్కిల్ నుంచి పూర్ణకలశాలతో భక్తులు హరతి ఘాటువరకు ర్యాలీ నిర్వహించారు. భక్తిపాటలు, భజన పాటలతో చిత్రావతి హారతి ఘాట్‌కు చేరుకుని పూజలు నిర్వహించారు.

పరిష్కరిస్తా.. లేదంటే నా డబ్బులు ఇస్తా..!

శ్రీరామిరెడ్డి పథకం కార్మికులకు ఎమ్మెల్యే అమిలినేని హామీ

సమ్మె విరమించిన కార్మికులు.. తప్పిన తాగునీటి ముప్పు



శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం/అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): సమ్మెకు దిగిన శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు భరోసా ఇచ్చారు. సమస్య గడువులోగా పరిష్కారమయ్యేలా చూస్తానని, లేదంటే కార్మికుల బకాయిలను తానే చెల్లిస్తానని హామీ ఇచ్చారు. దీంతో మంగళవారం రాత్రి సమ్మె ప్రారంభించిన కార్మికులు.. బుధవారం విరమించారు. బకాయి ఉన్న ఆరు నెలల జీతాలు, పీఎఫ్ వెంటనే చెల్లించాలని కార్మికులు సమ్మె బాట పట్టిన విషయం తెలిసిందే. కళ్యాణదుర్గం పంపుహౌస్ వద్ద బుధవారం బైఠాయించారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఫేజ్-1, ఫేజ్-4 పరిధిలోని కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో 292 మంది కార్మికులు ఉన్నామని, తమకు ఆరు నెలల వేతనం, 30 నెలల పీఎఫ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లించేదాకా సమ్మెను విరమించబోమని స్పష్టం చేశారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు వారికి మద్దతుగా నిలిచారు. బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. క్యూసీ, క్యూపె కమిటీల ప్రతిపాదనలను ఉపసంహరించాలని, లీటరు బేస్ విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. సమస్యలను అధికారులకు, ప్రజాప్రతినిధులకు వివరించినా పట్టించుకోలేదని, అందుకే వారు సమ్మెకు దిగారని అన్నారు. ఎమ్మెల్యే అమిలినేని వారి వద్దకు వెళ్లి మాట్లాడారు. ఈ నెలాఖరు లోపు.. లేదా మార్చి 3వ తేదీలోపు సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ఏదైనా సమస్య తలెత్తి, గడువులోగా సమస్య పరిష్కారం కాకుంటే తన సొంత డబ్బుతో కార్మికుల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీనికి సమ్మతించిన కార్మికులు.. సమ్మె విరమించారు. పంప్ హౌస్‌లో మోటార్లను ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. దీంతో ఉరవకొండ, కూడేరు, రాయదుర్గం, బెళుగుప్ప, మడకశిర, హిందూపురం ప్రాంతాల్లో నీటి సమస్య పరిష్కారమైంది. చర్చల్లో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, ఈఈ మురళీధర్‌రావు, డీఈ పాల్గొన్నారు.

అప్పుల పంట



వ్యాన్‌లోకి లోడ్ చేసిన కళింగర కాయలు

- తగ్గిన కళింగర దిగుబడి
- వేసవిలోనూ ధర పతనం
- పెట్టుబడినీ కోల్పోతున్న రైతులు
- అప్పుల పాలయ్యామని ఆవేదన



యాడికి వద్ద సాగుచేసిన కళింగర పంట

యాడికి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అన్నదాత ఆరుగాల కష్టం నష్టాలను మిగిల్చింది. ప్రస్తుత సీజన్‌లో కళింగర సాగుచేస్తే మంచి లాభాలు ఆర్జించవచ్చు అనుకున్న రైతులు.. ప్రతికూల వాతావరణంతో నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. పంట దిగుబడి, నాణ్యత తగ్గడంతోపాటు ధరలు కూడా పతనమయ్యాయి. అన్నదాత కష్టం నేలపాలైంది. మండలవ్యాప్తంగా సుమారు 400ఎకరాల్లో కళింగర పంట సాగు చేశారు. యాడికి, రాయలచెరువు, నగరూరు, లక్ష్ముంపల్లి, చందన, కేశవరాయునిపేట తదితర గ్రామాల్లో కళింగర పంట పెట్టారు. కిలో విత్తనం రూ.28వేలతో కొనుగోలు చేసి, నాటారు. పంట పూత, పిందె వచ్చే సమయంలో చలి, మేఘావృత వాతావరణం దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపినట్లు రైతులు తెలిపారు. సస్యరక్షణ చర్యలు ఎన్ని చేపట్టినా అవి పంట దిగుబడిని పెంచలేకపోయాయి. ఎకరాకు 15 నుంచి 20 టన్నుల వరకు దిగుబడి రావాల్సి ఉంది. ఈసారి 7 నుంచి 10 టన్నులు మాత్రమే వస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాలో కళింగర సాగుకు రూ.70వేల నుంచి రూ.90వేల వరకు పెట్టుబడులు పెట్టి సాగుచేసిన పంటలు దెబ్బతినడంతో రైతులు అప్పుల పాలవుతున్నారు.

తెల్లబూజు... పొడ...

చలి ప్రభావం, ఆకాశం మేఘావృతమై ఉన్న వాతావరణ పరిస్థితులు కళింగర పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపాయి. కళింగర కాయలపై తెల్ల పొడ ఎక్కువగా ఉన్నట్లు రైతులు తెలిపారు. కళింగర కాయ లోపలి భాగంలో తెల్లబూజు ఏర్పడి కాయ చెడిపోతున్నట్లు వాపోతున్నారు. తెల్లబూజు కారణంగా కాయలోపల తొర్ర ఏర్పడి తినడానికి పనికి రాకుండా పోతున్నట్లు తెలిపారు. పొడవచ్చిన కాయలను వ్యాపారులు కొనడం లేదు.

ధర పతనం

కళింగర గతంలో టన్ను రూ.18వేల నుంచి 22వేల వరకు ధర పలికిందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు 10టన్నుల దిగుబడి వచ్చినా రైతుకు లాభం వచ్చేది. ప్రస్తుత సీజన్‌లో ఎకరాకు పది టన్నుల దిగుబడి వస్తున్నా.. ధర అమాంతం పడిపోయింది. టన్ను కళింగర ధర రూ.7వేల నుంచి 8వేలలోపే పలుకుతోంది. ఈ ధరకు విక్రయిస్తే పెట్టుబడి కూడా దక్కదు. వెరసి రైతులు నష్టాలు మూటగట్టుకుంటున్నారు. ప్రస్తుతం ఉన్న ధరల్లో పంట దిగుబడిని మార్కెట్‌కు తరలించలేక రైతులు స్థానిక వ్యాపారులకు విక్రయిస్తుండడం గమనార్హం.



పెట్టుబడి కూడా వచ్చేది కష్టమే..

2.50 ఎకరాల్లో కళింగర సాగు చేశా. రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టా. 25 టన్నుల వరకు దిగుబడి వస్తోంది. ప్రస్తుతం కళింగర టన్ను రూ.7వేల నుంచి 8వేలలోపే ధర పలుకుతోంది. పెట్టుబడి కూడా వచ్చేది కష్టమే. వాతావరణ ప్రభావంతో కళింగర దిగుబడి తగ్గింది. నాణ్యతలోపంతో ధర కూడా పడిపోయింది. దీంతో నష్టాలు తప్పట్లేదు.

-శేఖర్, రైతు, రాయలచెరువు




4.50 ఎకరాల్లో సాగు చేశా

4.50 ఎకరాల్లో కళింగర సాగుచేశా. వాతావరణ ప్రభావంతో పంట దిగుబడి తగ్గింది. కాయల నాణ్యతపై తెల్లపొడ, తెల్లబూజు ప్రభావం ఎక్కువగా ఉంది. దీంతో ధర కూడా తగ్గింది. కలింగర ఇతర ప్రాంతాలకు ఎగుమతి అయితే ధరలు పెరుగుతాయి. లోకల్ మార్కెట్‌లో వ్యాపారులు మాత్రమే కొనుగోలు చేస్తుండడంతో ధరలు బాగా పతనమయ్యాయి.

-రవికుమార్‌రెడ్డి, రైతు, లక్ష్ముంపల్లి

సూక్ష్మసాయమూ లేదాయె..!

- సూక్ష్మ పోషకాల పంపిణీని అటకెక్కించిన వైసీపీ ప్రభుత్వం
- రైతులపై అదనపు భారం
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



ముదిగుబ్బ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): తమది రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకున్న గత వైసీపీ పాలకులు.. చేతల్లో మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించారు. సబ్సిడీపై సూక్ష్మ పోషకాల పంపిణీని అటకెక్కించడమే ఇందుకు నిదర్శనం. కొత్త పథకాలను అమలు చేయకపోగా.. అప్పటికే రైతులకు అందుతున్న ప్రయోజనాలను అటకెక్కించి అన్యాయం చేశారు. టీడీపీ హయాంలో చిన్న, సన్నకారు రైతులకు సబ్సిడీపై సూక్ష్మపోషకాలు అందించేవారు. తద్వారా రైతులకు పెట్టుబడి భారం తగ్గేది. పంట దిగుబడులు ఆశాజనకంగా వచ్చి, లాభం చేకూరేది. 2019లో వైసీపీ అధికారం చేపట్టాక ఆ సూక్ష్మసాయాన్ని అటకెక్కించింది. ఐదేళ్లలో రైతులకు సబ్సిడీపై సూక్ష్మపోషకాలు అందించిన దాఖలాలు లేవు. దీంతో రైతులు బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అలా రైతులపై అదనపు భారం పడుతోంది. అసలే వ్యవసాయ పెట్టుబడులు పెరిగిపోయిన తరుణంలో ఇది అదనపు భారంగా మారింది. కూటమి ప్రభుత్వమైనా సూక్ష్మపోషకాలను సబ్సిడీకి అందజేయాలని రైతులు కోరుతున్నారు.

ఎంతో అవసరం

ప్రతి మొక్క తన జీవిత చక్రాన్ని పూర్తి చేసుకోవడానికి 19 మూలకాలను ఆహారంగా తీసుకుంటుంది. కొన్ని పోషకాలను ఎక్కువ మోతాదులో, మరికొన్నింటిని తక్కువగా వినియోగించుకుంటుంది. తక్కువ మోతాదులో తీసుకునే వాటిని సూక్ష్మ పోషకాలు అంటారు. జింకు, ఇనుము, రాగి, మాంగనీస్, బోరాన్, మాలిబ్డినం, క్లోరిన్, సోడియం, వెనేడియం, సిలికాన్ వంటివి సూక్ష్మ పరిమాణంలో మొక్కలకు అవసరమవుతాయి. ఇవి మొక్క ఎదుగుదలతోపాటు దిగుబడుల్లో ప్రధాన పాత్ర పోషిస్తాయి. వీటి లోపం ఏర్పడితే దిగుబడులు తగ్గుతాయి. జిల్లాలో జింకు, బోరాన్ లోపాలున్న భూములే ఎక్కువగా ఉన్నట్లు వ్యవసాయ అధికారులు గుర్తించారు. అలాగే క్షార గుణం ఉన్న నేలలను బాగు చేసేందుకు, వేరుశనగ పైరుకు జిప్సం వాడతారు. ఈ మూడు రకాల సూక్ష్మ పోషకాలను గత వైసీపీ ప్రభుత్వం కేజీ కూడా పంపిణీ చేయలేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అదనపు భారం

సాధారణంగా జింకులోపం ఉన్న వరి పైరుకు ఎకరాకు 20 కిలోలు, ఇతర పైర్లకు 10 కిలోల జింక్ సల్ఫేట్ వేస్తారు. ఇలా మూడు పైర్లకు ఒకసారిగానీ, మూడేళ్లకోసారిగానీ వేయాలి. బోరాన్ లోపం ఉంటే ఎకరాకు కేజీ బోరాక్స్‌ను ఆఖరి దుక్కిలో వేస్తారు. నల్ల చవుడు నేలలో ఎకరాకు దాదాపు 200 కిలోల జిప్సం వేసి దున్నుతారు. వేరుశనగ పైరుకు జిప్సం ఎంతో ముఖ్యం. తాలు గింజలు లేకుండా కాయ ఊరడానికి, నూనె శాతం పెరగడానికి ఎకరాకి దాదాపు 200కిలోల జిప్సం వేయాలి. ఇవన్నీ రైతులపై అదనంగా పడుతున్న పెట్టుబడి ఖర్చులు. గతంలో టీడీపీ ప్రభుత్వం రెండున్నర హెక్టార్ల వరకు భూమి కలిగిన చిన్న, సన్నకారు రైతులకు సబ్సిడీతో వీటిని అందించేది. ఒక్కోసారి వందశాతం సబ్సిడీ కూడా వర్తింపజేసేది. ఇది రైతులకు ఎంతో ఉపశమనం కలిగించేది. వైసీపీ అధికారం చేపట్టాక ఆ ఊసే మరిచింది. రైతులకు అన్యాయం చేసింది.

ప్రభుత్వానికి నివేదిక పంపాం

సబ్సిడీపై సూక్ష్మ పోషకాలు అందించాలని రైతులు కోరడంతో ఆ మేరకు ప్రభుత్వానికి నివేదిక పంపాం. వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి రైతులకు సూక్ష్మ పోషకాలు అందించేలా కృషి చేస్తాం.

- సత్యనారాయణ, ఏడీఏ, కదిరి



నాణ్యమైన దిగుబడి

మామిడి, దానిమ్మ, కలింగర పంటలకు జిప్సం, జింకు ఇతర సూక్ష్మ పోషకాలు చాలా అవసరం. టీడీపీ హయాంలో వందశాతం సబ్సిడీతో రైతులకు పంపిణీ చేశారు. వాటిని పంటకు అందించడం ద్వారా దిగుబడులు నాణ్యతగా వచ్చేవి. గత వైసీపీ ప్రభుత్వం సబ్సిడీపై సూక్ష్మ పోషకాల పంపిణీని పూర్తిగా నిలిపేసింది. బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేయడం ద్వారా అదనపు భారం పడుతోంది. కూటమి ప్రభుత్వం సబ్సిడీతో సూక్ష్మ పోషకాలను రైతులకు అందించాలి.

- వెంకటరాముడు, రైతు, వలించెర్లోపల్లి



పంట దిగుబడి తగ్గుతోంది

గతంలో టీడీపీ ప్రభుత్వం వేరుశనగ పంటకు ఎకరాకు 200 కిలోల జిప్సం సబ్సిడీపై అందించింది. వైసీపీ అధికారం చేపట్టాక ఆ ఊసే మరిచిపోయింది. చిన్న, సన్నకారు రైతులు.. ప్రైవేటు దుకాణాల్లో కొనలేకపోతున్నారు. సూక్ష్మ పోషకాలు వినియోగించకపోవడంతో పంట దిగుబడులు తగ్గి రైతులు నష్టపోతున్నారు. కూటమి ప్రభుత్వం జిప్సం సబ్సిడీపై అందించాలి.

- నరేంద్ర, రైతు, ముదిగుబ్బ

జేఎన్టీయూ రెగ్యులర్ వీసీగా సుదర్శనరావు

ఎస్కేయూకి వారం ఆగాల్సిందే..



అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ రెగ్యులర్ వీసీగా ప్రొఫెసర్ సుదర్శనరావు నియమితుడయ్యారు. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక రాష్ట్రవ్యాప్తంగా వర్సిటీల వీసీలు రాజీనామా చేశారు. ఈ క్రమంలో గతేడాది జూలై 18న జేఎన్టీయూ ఇన్‌చార్జి వీసీగా ప్రొఫెసర్ సుదర్శనరావు బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పలు వర్సిటీలకు వీసీలను నియమించారు. అందులో భాగంగా జేఎన్టీయూ రెగ్యులర్ వీసీగా ప్రొఫెసర్ సుదర్శన రావుకు అవకాశం కల్పించారు.

వారం ఆగాల్సిందే...

రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది వర్సిటీలకు రెగ్యులర్ వీసీలను నియమించారు. వీటిలో ఎస్కేయూ లేకపోవడంతో ఉద్యోగ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. దీనికి తెరపడాలంటే మరో వారంరోజులు ఆగాల్సిందేనని తెలుస్తోంది. ఇన్‌చార్జి వీసీల నియామకం నుంచే జేఎన్టీయూ, ఎస్కేయూకి రెగ్యులర్‌గా ఎవరొస్తారన్న అంశంపై జోరుగా చర్చలు సాగాయి. అర్హత, అనుభవం తదితర కోణాల్లో ఎవరికి వారు బేరీజు వేసుకుంటూ వచ్చారు. జేఎన్టీయూకి ఇన్‌చార్జ్ పోయి రెగ్యులర్ పదం మాత్రమే మారుతుందన్న ఉద్యోగవర్గాల ఊహాగానాలు నిజమయ్యాయి. ఎస్కేయూకి ఇదే వర్తిస్తుందా? కొత్త పేరేమైనా వస్తుందా? అన్న చర్చలు వినిపిస్తున్నాయి.

మహిళ అదృశ్యం



వరలక్ష్మి (ఫైల్)

శెట్టూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన లింగారెడ్డి కుమార్తె వరలక్ష్మి (35) సోమవారం సాయంత్రం నుంచి కనిపించడం లేదని ఆమె తమ్ముడు మంజునాథరెడ్డి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వరలక్ష్మికి కర్ణాటకలోని తిప్పిరెడ్డిపల్లికి చెందిన నాగేంద్రతో వివాహమైంది. భర్తతో విభేదాల కారణంగా ఆమె కొన్నేళ్లుగా పుట్టింట్లోనే ఉంటోంది. ఈ నేపథ్యంలోనే సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె కనిపించలేదని తమ్ముడు ఫిర్యాదు చేశాడు.

లైనింగ్ తంటా..!

- లైనింగ్‌తో చివరి ఆయకట్టుకు సాగు నీరు
- హంద్రీనీవాపై రైతుల్లో అపోహలు కలిగిస్తున్న వైసీపీ
- సీఎం వద్దకు వెళ్లాలని అధికారపార్టీ ఎమ్మెల్యేల సన్నాహాలు



ప్రారంభమైన హంద్రీనీవా ప్రధాన కాలువ లైనింగ్ పనులు

పుట్టపర్తి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే కూటమి ప్రభుత్వం హంద్రీనీవా ఆధునికీకరణ పనులు చేపట్టింది. జీడిపల్లి రిజర్వాయర్ ప్రధాన కాలువ నుంచి పుంగనూరు ఉపకాలువ దాకా లైనింగ్ నిర్మాణం చేపట్టనున్నారు. ఇందుకు రూ.1368 కోట్ల నిధులు కేటాయించారు. తాజాగా రెండోదశ లైనింగ్ పనులను మొదలు పెట్టారు. అయితే ఐదేళ్ల పాలనలో హంద్రీనీవాను పట్టించుకోని వైసీపీ ఇప్పుడు లైనింగ్ నిర్మాణంతో భూగర్భ జలాలు అడుగంటి, పచ్చని పొలాలు బీళ్లుగా మారుతాయని ప్రచారం మొదలు పెట్టింది. రైతుల తరఫున అల్టిమేటం అంటూ ఇటీవల రాప్తాడు వైసీపీ మాజీ ఎమ్మెల్యే రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో కొందరు అధికార పార్టీ ఎమ్మెల్యేలు హంద్రీనీవా లైనింగ్ అంశాన్ని సీఎం చంద్రబాబు వద్దకు తీసుకెళ్లే సన్నాహాలు చేస్తున్నారు. కాలువకు లైనింగ్ నిర్మిస్తే నీటి వృధాను అరికట్టి చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించవచ్చని హంద్రీనీవా ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు. ఈ అంశంపై ఎదురవుతున్న సమస్యలపై ఓసారి చర్చించి, వైసీపీ విష ప్రచారానికి తెర వేయాలని హంద్రీనీవా ప్రధాన కాలువ వెళ్లే నియోజక వర్గాల ఎమ్మెల్యేలు సిద్ధమవుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఆరు లక్షల ఎకరాల సాగు లక్ష్యం

హంద్రీనీవాతో ఉమ్మడి జిల్లాలో ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రధాన కాలువ విస్తరణ, లైనింగ్ చేపట్టి నీటి వృధాను నియంత్రించి రిజర్వాయర్లతో పాటు చెరువులను నింపాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. కేటాయించిన నిధులతో వంద రోజుల్లో లైనింగ్ పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో అధికారులు పనులు మొదలు పెట్టారు. లైనింగ్‌తో సాగు, తాగు నీటి సమస్యలు తీరేలా ప్రణాళికలు చేపట్టారు. ఇప్పటికే జీడిపల్లి రిజర్వాయర్ నుంచి ప్రధాన కాలువతోపాటు పుంగనూరు ఉపకాలువ లైనింగ్ పనులు మొదలు పెట్టారు. ఈ పనులు పూర్తయితే నీటి వృధా పూర్తిగా తగ్గిపోతుం దని హంద్రీనీవా అధికారులు చెబుతున్నారు.

రైతులు, నాయకుల్లో లైనింగ్ టెన్షన్

జీడిపల్లి నుంచి రెండో దశ హంద్రీనీవా కాలువ ఉరవకొండ నియోజకవర్గంలో మొదలై రాప్తాడు, పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల మీదుగా సాగుతుంది. ఈకాలువకు ఇరువైపులా రైతులు బోర్లు వేసుకుని పంటలు పండిస్తున్నారు. కిలోమీటర్ల దూరంలోని రైతులు సైతం హంద్రీనీవా కాలువ ద్వారా వచ్చిన నీటితో నిండిన చెరువుల్లోకి పైపు లైన్లు వేసుకుని భూములను సాగు చేసుకుంటున్నారు. ప్రధానంగా రాప్తాడు, పుట్టపర్తి నియోజకవర్గాల్లో కాలువ ఉండగా కదిరి నియోజకవర్గంలో ప్రధాన కాలువతోపాటు పుంగనూరు, కుప్పం ఉపకాలువ ఉంది. లైనింగ్ ఏర్పాటుతో కాలువ ఇరువైపులా భూగర్భ జలమట్టం అడుగంటుతుందని ఇటీవల ఆయా నియోజక వర్గాల్లో వైసీపీ నాయకులు రైతుల్లో అపోహలు కలిగిస్తున్నారు. ఈనేపథ్యంలో హంద్రీనావా కాలువ ద్వారా వచ్చిన నీటితో పంటలు పండించుకుంటున్న రైతుల్లో అలజడి మొదలైంది. లైనింగ్‌తో భూగర్భ జలాలు అడుగంటుతాయని ఆయా నియోజకవర్గాల్లో అధికార పార్టీ ఎమ్మెల్యేల వద్ద రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ మనుగడ కోసం లైనింగ్‌పై అపోహలు కలిగిస్తోన్న వైసీపీని ఎలా ఎదుర్కోవాలని రాప్తాడు, పుట్టపర్తి ఎమ్మెల్యేలు మల్లగుల్లాలు పడుతున్నారు. దేశంలో దాదాపు అన్ని రాష్ట్రాల్లో సాగునీటి కాలువలకు లైనింగ్ ఏర్పాటు చేసి, నీటి పొదుపు చర్యలు పాటిస్తుంటే ఉమ్మడి జిల్లాలో మాత్రం హంద్రీనీవా కాలువకు లైనింగ్ ఏర్పాటుపై అపోహలు కలుగుతున్నాయి.

మామిడి రైతుల కోసం..

50 శాతం సబ్సిడీతో రక్షణ కవచం



మామిడి ఫ్రూట్‌కేర్ కవర్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మామిడి రైతులకు 50 శాతం సబ్సిడీతో ఫ్రూట్ కేర్ కవర్ పంపిణీ చేస్తామని ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది జిల్లాలో 1000 హెక్టార్లలకు అవసరమైన మామిడి రక్షణ కవచం పంపిణీ చేయాలని లక్ష్యం విధించార న్నారు. ఒక్కో రైతుకు హెక్టారుకు 20వేల రక్షణ కవచం కవర్లు ఇస్తామన్నారు. ఒక్కో కవర్ పూర్తి ధర రూ.2లు కాగా సబ్సిడీతో రూ.1కి అందజేస్తామని తెలిపారు. ఈ ఫ్రూట్ కవర్‌ను మామిడి పిందే దశలో (నిమ్మకాయ, కోడిగుడ్డు పరిమాణంలో) ఉన్నప్పుడు కట్టాలన్నారు. ఈ ఫ్రూట్ కవర్ వాడటం ద్వారా ఊజీ ఈగ, మచ్చలు, తేనె మంచు పురుగు, తామర పురుగు తదితర తెగుళ్లను నివారించడంతోపాటు నాణ్యమైన పండ్ల దిగుబడి వస్తుందన్నారు. క్రిమి కీటకాలు పండ్లను నాశనం చేయకుండా, అధిక సూర్యరశ్మి నుంచి కూడా రక్షణ కల్పించవచ్చని వెల్లడించారు. ఫ్రూట్ కవర్‌ను వినియోగించడం ద్వారా పురుగుమందులు వాడాల్సిన అవసరం ఉండదన్నారు. కాయకుండే సహజ మంచి లక్షణాలను పెంచి, తొడిమ దృఢంగా తయారై, కాయ పరిమాణాన్ని పెంచడంతోపాటు కాయ సహజ రంగును పెంచుతుందన్నారు. మామిడి సాగు చేసే రైతులు ఈ పథకానికి అర్హులన్నారు. ఫ్రూట్ కవర్ కావాల్సిన రైతులు స్థానిక ఉద్యాన కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

చీనీలో సస్య రక్షణ ఇలా..



చీనీ తోటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి

రాప్తాడు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చీనీ పంటకు తెగుళ్లు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి రత్నకుమార్ తెలిపారు. మండలంలోని హంపాపురం గ్రామంలో మంగళవారం రైతులతో కలిసి చీనీ తోటను పరిశీలించి, తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉద్యానశాఖ అధికారి మాట్లాడుతూ రాత్రి వేళ చలి, మంచు ఎక్కువగా ఉండటం, పగటి పూట ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండటం వలన పడమర దిశలో ఉన్న చీనీ కాయలు ఎండ పొడకు గురవుతున్నాయన్నారు. ఎండ పొడ నివారణకు రైతులు సాకీయంగా కొమ్మలు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలన్నారు. యూరియా 10 గ్రాములు ఒక్క లీటరు నీటికి కలిపి స్ప్రే చేసుకోవాలన్నారు. అలాగే వారం తర్వాత లీటరుకు 20 గ్రాములు బట్టి సున్నం కలిపి స్ప్రే చేస్తే కాయలకు ఎండపొడతెగులు రాకుండా కాపాడుకోవచ్చన్నారు. రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్, గార్లదిన్నె మండలంలో రైతు సేవా కేంద్రం ద్వారా ఉద్యాన రైతులకు సేవలు అందిస్తున్నట్లు వివరించారు.

యూట్యూబర్ మృతదేహం లభ్యం

హత్య అని అనుమానం

పోలీసుల అదుపులో అనుమానితుడు



రోదిస్తున్న తిరుమలరెడ్డి భార్య, కుమార్తె, కుటుంబ సభ్యులు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం ఉదయం అదృశ్యమైన యూట్యూబర్ బోగాల తిరుమల రెడ్డి(42) మంగళవారం విగతజీవిగా కనిపించాడు. మండలంలోని బుగ్గ సంగాల వద్ద ఉన్న తన తోటకు తిరుమలరెడ్డి సోమవారం ఉదయం ద్విచక్రవాహనంపై వెళ్లాడు. అయితే మార్గమధ్యంలో హంద్రీనీవా కాలువ పక్కన తిరుమల రెడ్డి ద్విచక్ర వాహనం ధ్వంసమై కనిపించింది. బైక్‌కు సమీపంలోనే తిరుమల రెడ్డికి చెందిన చెప్పులు, సెల్‌ఫోన్, డబ్బులు కనిపించాయి. తిరుమల రెడ్డి కుటుంబ సభ్యుల ఫిర్యాదుపై మిస్సింగ్ కేసును నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. గజ ఈతగాళ్లతో తిరుమలరెడ్డి ఆచూకీ కోసం హంద్రీనీవా కాలువలో వెతికించారు. మంగళవారం ఉదయం హంద్రీనీవా కాలువలో తిరుమల రెడ్డి మృతదేహం తేలియాడుతూ కనిపించింది. ఘటనా స్థలానికి రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్, కసాపురం ఎస్ఐ వెంకటస్వామి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించారు. తిరుమల రెడ్డి మృతదేహాన్ని పరిశీలించగా కుడి కన్ను కందిపోయి, కుడి కాలు విరిగిపోయి కనిపించాయి. పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వద్దకు తిరుమలరెడ్డి కుటుంబ సభ్యులు పెద్దఎత్తున చేరుకున్నారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా సంఘంలో పనిచేస్తూ ఆక్రమాల మీద ప్రశ్నిస్తే చంపేస్తారా అంటూ తిరుమల రెడ్డి కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుడి భార్య కామేశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

పోలీసుల అదుపులో అనుమానితుడు


తిరుమలరెడ్డి మృతిని హత్యగా భావించి, అనుమానంతో సంగాల గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని పోలీసులు సోమవారమే అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అతడిని పోలీసులు విచారించగా తిరుమల రెడ్డిని హత్య చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిసింది. తన భర్త బుగ్గ సంగాలకు చెందిన కుమార్‌తో ఘర్షణపడ్డాడని మృతుడి భార్య సోమవారం అనుమానం వ్యక్తంచేసిన సంగతి తెలిసిందే. బుగ్గసంగమేశ్వర దేవాలయం సమీపంలో నిందితుడి పొలం ఉంది. పొలం పక్కనే ప్రభుత్వ పోరంబోకు స్థలం ఉంది. ఈ స్థలంలో నిందితుడు మట్టి వేసి చదును చేశాడు. ఈ విషయంపై తిరుమల రెడ్డి అతడితో గతంలో గొడవ పడినట్లు తెలిసింది. ఈ విషయంగా తిరుమల రెడ్డి కలెక్టరు, తహసీల్దారుకు ఫిర్యాదు చేశాడు. కోర్టులో కేసు వేస్తానని తిరుమలరెడ్డి తనను బెదిరించినట్లు నిందితుడు పోలీసుల విచారణలో చెప్పినట్లు సమాచారం. దీంతో పథకం ప్రకారం తిరుమల రెడ్డిపై దాడి చేసి, హత్య చేసినట్లు పోలీసు విచారణలో ఒప్పుకున్నట్లు తెలిసింది. వివరాలను పోలీసులు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

బోగస్ పట్టాలకు రుణాలు
మార్ట్‌గేజ్‌లో ఉన్న భూములూ విక్రయం
వెలుగు చూస్తున్న అక్రమాలు



జంతలూరు గ్రామంలోనే అధికంగా మార్ట్‌గేజ్‌లో ఉన్న భూములను విక్రయించినట్లు చెబుతున్నారు.. ఏడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయం

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘా(పీఏసీఎస్)లను అవినీతి, అక్రమాలకు అడ్డాలుగా మార్చారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బోగస్ పట్టాలకు రుణాలిచ్చారు. మార్ట్‌గేజ్‌లో ఉన్న భూములను సైతం విక్రయించారు. తాజాగా నిర్వహించిన ఏడీసీసీ బ్యాంకు బోర్డు సమావేశంలో బుక్కరాయసముద్రం సొసైటీ పరిధిలోని మార్ట్‌గేజ్ చేసిన భూములపై మరో బ్యాంకులో రుణాలు పొందడం, ఇదే భూములను ఓ రిటైర్డ్ అటవీ అధికారికి విక్రయించిన విషయం చర్చకు రావడం కలకలం రేపుతోంది. సొసైటీల్లో రుణాలు పొంది తాకట్టు పెట్టిన ఒరిజినల్ పట్టాలు బయటకు ఎలా వెళ్లాయన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. బోగస్ పట్టాలు తాకట్టు పెట్టి రుణాలు పొందారా అనే సందేహాలు వినిపిస్తున్నాయి. ఇదంతా ఇంటి దొంగల పనేనంటూ



సొసైటీ ఉద్యోగులపై సహకార శాఖ అధికారులు సమావేశంలో అనుమానాలు వ్యక్తం చేయడం గమనార్హం. ఇదే అంశంపై ఏడీసీసీ బ్యాంకు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు కూడా అందాయి. ఆత్మకూరు సొసైటీ పరిధిలో పది మందికి బోగస్ పట్టాలపై రుణాలిచ్చిన వ్యవహారంలో బాధ్యుడైన అధికారిని కాపాడేందుకు తూతూమంత్రంగా విచారణ చేసి, తనకు ఉద్యోగులు సహకరించడం లేదంటూ నివేదిక ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం క్లాక్‌టవర్

సొసైటీల్లో ఇష్టారాజ్యం..!

28 శాఖలు.. 108 సొసైటీలు

ఉమ్మడి జిల్లాలో 28 ఏడీసీసీ బ్యాంకు శాఖలున్నాయి. వీటి పరిధిలో 108 సొసైటీలున్నాయి. వాటిలో ఇప్పటి వరకు 37,512 మందికిగాను చెల్లించిన రుణాల్లో రూ.188 కోట్లు ఎన్‌పీఏ కిందికి వెళ్లాయి. వీటిలో భూములు లేకుండానే బోగస్ పట్టాలపై ఇచ్చిన రుణాలే ఎన్‌పీఏగా మారాయని తెలుస్తోంది. ఎన్‌పీఏల వసూలుకు వ్యక్తిగతంగా, యూనియన్ల పరంగా వెళ్లకూడదనేది బ్యాంకింగ్ వ్యవస్థలోని నిబంధన. ఇందుకు విరుద్ధంగా ఏడీసీసీ బ్యాంకులో ఓ యూనియన్ తరఫున ఎన్‌పీఏల రికవరీకి వెళ్లడం విమర్శలకు తావిస్తోంది. ఏడీసీసీ బ్యాంకు అధికారులు ఓ యూనియన్‌కు వత్తాసు పలుకుతూ ఈ తంతు సాగిస్తున్నారనే చర్చ వినిపిస్తోంది. రుణాల వసూళ్లలో అటు బ్యాంకు అధికారులు, ఇటు సొసైటీ ఉద్యోగులు ఏమాత్రం శ్రద్ధ పెట్టడం లేదనీ, కనీస బాధ్యత తీసుకోవట్లేదని ఇటీవల నిర్వహించిన బోర్డు సమావేశంలో ఉన్నతాధికారులు అసహనం వ్యక్తం చేయడం గమనార్హం.

పట్టాలు బయటకు ఎలా వెళ్లాయి?

బ్యాంకు, సొసైటీల్లో రుణాలు పొందిన భూపట్టాలు అక్కడే మార్ట్‌గేజ్ చేసి, ఒరిజినల్ పట్టాలు తాకట్టు పెట్టాల్సి ఉంటుంది. సొసైటీల్లో తీసుకున్న తరువాత మరో బ్యాంకులో అదే పట్టాపై రుణం పొందడం అనుమానాలకు తావిస్తోంది. బోగస్ పట్టాలు సృష్టించి ఉండాలన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇందులో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల అధికారుల పాత్రపై విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎంచక్కా.. విక్రయించారు..

బుక్కరాయసముద్రం సొసైటీలోనే మార్ట్‌గేజ్ చేసిన భూములను అధికంగా విక్రయించారు. సొసైటీలో రుణం పొందిన ఓ వ్యక్తి ఆ భూములపైనే తిరిగి మరో బ్యాంకులో లోన్ తీసుకున్నాడు. అక్కడితో ఆగకుండా అదే భూమిని ఓ రిటైర్డ్ అటవీ అధికారికి విక్రయించినట్లు సమాచారం. ఇదే విషయాన్ని ఇటీవల నిర్వహించిన ఏడీసీసీ బ్యాంకు బోర్డు సమావేశంలో అధికారులు లేవనెత్తారు. బుక్కరాయసముద్రం మండలం జంతులూరు గ్రామంలో ఇలా భూములను విక్రయించి, ఇతర బ్యాంకుల్లోనూ రుణాలు పొందారని స్వయంగా ఏడీసీసీ బ్యాంకు అధికారులే పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది.



బుక్కరాయసముద్రం సొసైటీ కార్యాలయం



నిబంధనలకు విరుద్ధంగా యూనియన్ తరఫున రుణాల రికవరీ చేస్తున్న ఉద్యోగులు

అవినీతి, అక్రమాలకు అడ్డాలు

సొసైటీల్లో అనేక అక్రమాలు బయటపడుతున్నాయి. సొసైటీల్లో ఉద్యోగులు ఏళ్లుగా ఒకేచోట పనిచేస్తుండడం కూడా ఇందుకు కారణమని తెలుస్తోంది. ఆత్మకూరు సొసైటీలో సుమారు 10 మందికి బోగస్ పట్టాలపై రుణాలు మంజూరు చేసిన విషయం తెలిసిందే. దీనిపై విచారణకు ఆదేశించారు. తూతూమంత్రంగా విచారణ చేసిన ఏడీసీసీ బ్యాంకు డీజీఎం రాంప్రసాద్, బ్యాంకు, సొసైటీ ఉద్యోగులు విచారణకు సహకరించలేదంటూ నివేదిక ఇవ్వడం గమనార్హం. బోగస్ పట్టాలకు రుణాలు చెల్లించడంలో కీలకంగా ఉన్న ఓ అధికారిని రక్షించేందుకే ఇలా.. నివేదిక ఇచ్చారని పలువురు ఆ శాఖలోని అధికారులే చర్చించుకుంటుండడం గమనార్హం.



ఇటీవల నిర్వహించిన బోర్డు సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ

మార్ట్‌గేజ్ భూములను విక్రయించరాదు

మార్ట్‌గేజ్‌లో ఉన్న భూములను విక్రయించరాదు. ఇతర బ్యాంకుల్లో కూడా రుణాలు పొందరాదు. బుక్కరాయసముద్రం సొసైటీ పరిధిలో మార్ట్‌గేజ్‌లో ఉన్న భూములను ప్రభుత్వ అధికారులు కొనుగోలు చేసినట్లు మా దృష్టికి వచ్చింది. ఇలాంటివి 25కిపైగా ఉన్నట్లు గుర్తించాం. వీటిపై విచారించి, బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

- శివనారాయణ శర్మ, జాయింట్ కలెక్టర్, ఏడీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి

హత్యా..? ఆత్మహత్యా..?

ఇంటర్ విద్యార్థి అనుమానాస్పద మృతి

- ఉరికి వేలాడిన ఎస్ఆర్ కాలేజీ విద్యార్థి
- తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వని యాజమాన్యం
- మృతదేహంతో ఆందోళనకు దిగినా.. స్పందన కరువు
- పోలీసుల హామీతో శాంతించిన కుటుంబ సభ్యులు



అనంతపురం విద్య, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): 'నోరు సచ్చినోడు. ఎవర్నీ ఏమనేటోడు కాదు. మంచి పిల్లోడు. ఆదివారం రాత్రి కాటమయ్య కొండకు పొయ్యొచ్చినాడు. ఏమైందో.. ఏమో..! మీ పిల్లోడు సచ్చిపొయినాడని కాలేజీ పిల్లోళ్లు చెప్పినారు. అన్యాయంగా నా కొడుకును సంపినారు. మీ కొడుగు చస్తే మీకు తెలుస్తాది బాధ..' చేతికొచ్చిన బిడ్డ చెట్టుకు నిర్జీవంగా వేలాడటంతో.. ఆ కన్నతల్లి గుండె పగిలేలా ఏడ్చింది. శాపనార్థాలు పెట్టింది. ధర్మవరం మండలం మల్కాపురం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి శ్రీకాంత్(19) అనుమానాస్పద మృతితో అనంతపురం రూరల్ మండలంలోని ఎస్ఆర్ జూనియర్ కాలేజీ వద్ద మంగళవారం ఉద్రిక్తత ఏర్పడింది. తల్లిదండ్రులు, బంధువులు, విద్యార్థి సంఘాల నాయకులు శ్రీకాంత్ మృతదేహంతో కాలేజీ ప్రధాన ద్వారం వద్ద బైఠాయించారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ అరుపులు, ఆర్తనాదాలు, నినాదాలు మిన్నంటాయి. కాలేజీ యాజమాన్యం వైపు నుంచి ఎవరూ స్పందిచకపోవడంతో గేటును తోసుకుని లోపలికి వెళ్లేందుకు యత్నించారు.



ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాలు

అనుమానాస్పదం..

మల్కాపురం గ్రామానికి చెందిన మిడతల శ్రీకాంత్ అనంతపురం రూరల్ పరిధిలోని ఆలమూరు రోడ్డులో ఉన్న ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ చదువుతున్నాడు. అక్కులప్ప, నారాయణమ్మ దంపతులకు ముగ్గురు సంతానం కాగా, పెద్దకొడుకు మూర్తి, కూతురు ముత్యాలమ్మ, చివరివాడు శ్రీకాంత్. విశ్వసనీయ సమాచారం మేరకు, శ్రీకాంత్ తన స్నేహితుడు మహేంద్రతో కలసి దేవున్ని చూడ్డానికి మూష్టూరు వద్ద ఉన్న కాటమయ్య కొండకు ఆదివారం వెళ్లి వచ్చారు. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకూ క్లాసులు, స్టడీ అవర్స్‌లో ఉన్నాడు. రాత్రి 10 నుంచి 10.30 గంటల వరకూ మిత్రులకు కనిపించాడు. మంగళవారం ఉదయం 6.30 గంటలకు కాలేజీ హాల్ భవంతి నుంచి సుమారు 150 అడుగుల దూరంలో ఉన్న ఓ దానిమ్మ తోటలో ఎండిన చెట్టుకు డ్రిప్ పైప్‌తో ఉరివేసుకుని కనిపించాడు. విద్యార్థి మృతదేహం నేలకు తాకడం, చొక్కాపై రక్తపు మరకలు, డొక్కపైన చిన్న గాయం, కళాశాల సిబ్బంది నుంచి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకపోవడం.. ఇవన్నీ అనుమానాలకు తావిస్తున్నాయి.

కనిపించని యాజమాన్యం

శ్రీకాంత్ మృతి సమాచారం తెలియగానే తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కన్నీరుమున్నీరవుతూ కాలేజీ వద్దకు వచ్చారు. కడుపు మంటతో అక్కడున్న సిబ్బందిని తిట్టారు. జోనల్ ఇన్‌చార్జ్, ప్రిన్సిపాల్ బయటకు రావాలని కేకలు వేశారు. పరీక్షలు జరుగుతున్నాయంటూ పోలీసులు వారిని బలవంతంగా బయటకు పంపారు. ఇంత ఘోరం జరిగినా ఎవరూ స్పందించకపోవడంతో బాధితులు మృతదేశాన్ని స్ట్రెచ్చర్ తీసుకొచ్చి రోడ్డుపై బైఠాయించారు. మండుటెండలో ఏడ్చి, ఏడ్చి తండ్రికి నోట మాట రాలేదు. తల్లి, అన్న, చెల్లి సొమ్మసిల్లేలా ఏడుస్తూ కనిపించారు. బంధువులు కన్నీళ్లు పెట్టుకున్నారు. రెండున్నర గంటలపాటు మృతదేహంతో బైఠాయించినా యాజమాన్యం వైపు నుంచి స్పందన రాలేదు. దీంతో కళాశాల గేట్లు తోసుకుని లోపలికి వెళ్లేందుకు యత్నించారు. అడ్డుకున్న పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఆ తరువాత కొందరిని పోలీసుల ఆధ్వర్యంలో కళాశాలలోకి అనుమతించారు. జోనల్ ఇన్‌చార్జ్, ప్రిన్సిపల్‌పై కేసులు పెట్టాలని, అరెస్టు చేయాలని బయట ఉన్నవారు నినాదాలు చేశారు. చర్చల తరువాత, న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతదేహాన్ని పెద్దాసుపత్రికి తరలించారు. కాలేజీకిలో వెళ్లొచ్చిన తరువాత ఆర్ఐఓ వెంకటరమణ మీడియాతో మాట్లాడారు. విద్యార్థులతో స్వయంగా మాట్లాడానని, విచారణ నివేదిక రాగానే కాలేజీపై చర్యలు తీసుకుంటామని చెప్పి వెళ్లిపోయారు.



ఉరికి వేలాడుతున్న శ్రీకాంత్

భయపడ్డాడా.. భయపెట్టారా..?

విద్యార్థి మరణానికి కారణాలు తెలియడం లేదు. భయపడ్డాడా.. లేక భయపెట్టారా అనే చర్చ జరుగుతోంది. అధికారులు తెలిపిన మేరకు.. రూ.60 వేల ఫీజులో ఇప్పటికే రూ.20 వేలు చెల్లించారు. రూ.40 వేలు పెండింగ్ ఉంది. కళాశాల నుంచి ఫీజుల ఒత్తిడిపై స్పష్టత రావడం లేదు. రాత్రి స్టడీ అవర్స్ 10.30 గంటలకు ముగిసినా.. శ్రీకాంత్ తరచూ 11 గంటల వరకూ చదువుకునేవాడని సహ విద్యార్థులు అంటున్నారు. చదువుల ఒత్తిడితో ఆత్మహత్య చేసుకున్నాడా..? లేక కళాశాల యాజమాన్యం ఫీజు కోసం ఒత్తిడి చేసిందా..? అన్న స్పష్టత లేదు. పోస్టుమార్టం నివేదిక వస్తే హత్యా..? ఆత్మహత్యా..? అనేది తేలుతుంది.

యువకుడి ఆత్మహత్య



ఈశ్వర్ (ఫైల్)

కణేకల్లు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని 43 ఉడేగోళం గ్రామానికి చెందిన బోయ ఈశ్వర్(25) మంగళవారం రాత్రి ఆత్మహత్యకు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడు గ్రామంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తు జీవించేవాడు. ఏమి జరిగిందో కానీ మంగళవారం సాయంత్రం తన ఇంట్లో ఉరి వేసుకున్నాడు. బంధువులు గమనించి కణేకల్లు క్రాసింగ్‌లోని ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు ఈశ్వర్‌కు భార్య కావేరితో పాటు ఒక కుమారుడు ఉన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఐటీఐ విద్యార్థులకు జాబ్‌మేళా

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఐటీఐ పాసైన విద్యార్థులకు ఈనెల 21 జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీఐ కళాశాలల జిల్లా కన్వీనర్ రామమూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. హిందూపురం, దొడ్డబళ్లాపూర్, బెంగళూరుకు చెందిన వివిధ ప్రముఖ కంపెనీలు ఈమేళాలో పాల్గొంటాయన్నారు. నగరంలోని శ్రీసాయి వెంకటేశ్వర ఐటీఐ కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూలకు విద్యార్థులు వారి సర్టిఫికెట్లు, పాస్‌ఫొటోలతో హాజరు కావాలన్నారు.

మాట నిలబెట్టుకోండి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

పేదలకు ఇంటి పట్టాల కోసం నిరసన



మాట్లాడుతున్న రామకృష్ణ



ధర్నాకు హాజరైన పేదలు

తాడిపత్రి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పేదలకు పట్టాలు ఇచ్చి ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ ఆధ్వర్యంలో ఇంటి పట్టాల కోసం మంగళవారం నిర్వహించిన నిరసనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పేదలకు పట్టణంలో 2సెంట్లు, గ్రామాల్లో 3సెంట్లు ఇస్తామని ప్రకటించిందన్నారు. ఆ వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. పేదలకు రూ.5లక్షల వ్యయంతో పక్కా ఇంటి నిర్మాణం చేస్తామని కూడా ఎన్నికల సందర్భంగా చెప్పారని, అధికారం చేపట్టి దాదాపు 10నెలలైనా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పేదలకు ఇళ్లు, స్థలాలపై ఇప్పటికే రెవెన్యూ మంత్రి, మున్సిపల్ మంత్రి, సీఎం చంద్రబాబుతో కూడా చర్చించినట్లు వెల్లడించారు. వారంతా సానుకూలంగా స్పందించారు కనుక శాంతియుతంగా పట్టాల కోసం నిరసన కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. గత టీడీపీ పాలనలోనే 80 శాతం నిర్మాణం పూర్తి చేసిన టిడ్కో ఇళ్లను వినియోగంలోకి తేవాలన్నారు. 24వతేదీ నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో పేదల ఇళ్లు, స్థలాల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. జగన్ పాలనలో పేదలకు 31లక్షల ఇళ్లకు పట్టాలు ఇచ్చాం అని చెప్పడం తప్ప చేసిందేమి లేదని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగదీష్ మాట్లాడుతూ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డితో మాట్లాడానని ఇళ్లులేని నిరుపేదలకు ఇంటి స్థలాలకు పట్టాలు ఇవ్వాలని ఆయనతో చర్చించినట్లు పేర్కొన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా 33లక్షల మందికి ఇంటిస్థలాల కాగితాలు మాత్రమే పంపిణీ చేశారు. పట్టణాల్లో సెంటు, గ్రామాల్లో సెంటున్నర చొప్పున ఇచ్చారు. ఇంటినిర్మాణానికి రూ.1.8లక్షలు మాత్రమే ఇచ్చి నిర్మాణాలను పడక ఎక్కించారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాజారెడ్డి, రంగయ్య, వెంకటరాముడుయాదవ్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన రిటైర్డ్ పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధులు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తెలుగు రాష్ట్రాల రిటైర్డ్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు మహబూబ్ సాహెబ్ ఆధ్వర్యంలో జిల్లా రిటైర్డ్ పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధులు జిల్లా ఎస్పీ జగదీష్‌ను మంగళవారం కలిశారు. 1961 నుంచి 1975వరకు రిక్రూట్ అయిన పోలీస్ సిబ్బంది ప్రొబేషన్ కాలానికి సంబంధించి యాన్యువల్ ఇంక్రిమెంట్, వెయిటేజ్ ఇంక్రిమెంట్ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరు తూ వినతిపత్రం అందజేశారు. పరిశీలించి పరిష్కారం చూపుతానని ఎస్పీ వారికి హామీ ఇచ్చారు.

నేడు జిల్లాకు రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ రాక

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ పి. విజయ్‌కుమార్ బుధవారం జిల్లాకు రానున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ ఈడీ రాధిక తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. మాల కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో జిల్లాల వారీగా పర్యటనలో భాగంగా అనంత జిల్లాకు రానున్నట్లు తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు ఎస్సీ సంఘాల నాయకులతో సమావేశమవుతారన్నారు. 11 గంటలకు కార్యాలయ ఉద్యోగులతో వివిధ రకాల సంక్షేమ పథకాలపై సమీక్షిస్తారన్నారు. 12.00 గంటలకు విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 12.30గంటల నుంచి 1.30 గంటల వరకూ ఎస్సీ కార్పొరేషన్ పరిధిలోని టవర్ క్లాక్, కలెక్టరేట్ వద్దనున్న ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్‌లు, టీవీ టవర్ వద్దనున్న ఇండస్ట్రీయల్ కాంప్లెక్స్‌లను పరిశీలిస్తారన్నారు. అనంతరం కడపకు బయలుదేరి వెళ్తారన్నారు.

పథకాల అమలులో బ్యాంకర్లదే కీలక పాత్ర

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

విరివిగా పంట రుణాలు ఇవ్వాలి: ఎంపీ అంబికా



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అంబికా

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అర్హులకు దరి చేర్చడం, అమలులో బ్యాంకర్ల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక జడ్పీలోని డీపీఆర్‌సీ భవనంలో బ్యాంకర్ల మూడు నెలల పురోగతిపై సమీక్షా సమావేశం, సంప్రదింపుల కమిటీ జిల్లా స్థాయి సమావేశం మంగళవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన అమలు, రుణాల చెల్లింపులు నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. లక్ష్యసాధనలో బ్యాంకర్లు నిర్లక్ష్యం వహించరాదని, జిల్లా అభివృద్ధికి బ్యాంకర్ల పాత్ర కీలకమన్నారు. జిల్లాలో 34బ్యాంకులకు సంబంధించి 290బ్రాంచ్‌లు ఉన్నాయన్నారు. గుర్తించిన 51గ్రామాల్లో ఆర్ఓ ప్లాంట్ల కోసం బ్యాంకులకు ప్రత్యేకంగా లేఖలు రాసి ఏర్పాటు చేసేలా ఎల్‌డీఎం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్థిక అక్షరాస్యత, స్వయం ఉపాధిలో శిక్షణలో పాల్గొంటున్నవారికి శిక్షణ పూర్తయ్యాక సర్టిఫికెట్లు అందజేయాలన్నారు. స్టాండప్ ఇండియా పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు నాటికి 39.34శాతం మాత్రమే రుణాలు ఇచ్చారని, కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా అర్హులైన లబ్ధిదారులకు ఆయా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కింద రుణాలను మంజూరు చేయాలని సూచించారు. విద్యారుణాలకు సంబంధించి యూకో బ్యాంకు 109మందికి గాను కేవలం ముగ్గురికి మాత్రమే అందజేశారని, స్పెషల్‌డ్రైవ్ ద్వారా అర్హులైన విద్యార్థులందరికీ విద్యారుణాలు అందజేసేలా చూడాలని ఆదేశించారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జిల్లాలోని రైతుల శ్రేయస్సు కోసం బ్యాంకులు మానవతాదృక్పథంతో పనిచేయాలని, విరివిగా పంట రుణాలు అందజేసి తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య, ఎల్‌డీఎం నర్సింగారావు, వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, జిల్లా ఉద్యానశాఖ అధికారి నరసింహారావు, జిల్లా పరిశ్రమలశాఖ జెడ్ఎం శ్రీధర్, మత్స్యశాఖ డీడీ శ్రీనివాసనాయక్, మెప్మా పీడీ విశ్వజ్యోతి, చేనేత జౌళి శాఖ ఏడీ శ్రీనివాసరెడ్డి, జిల్లా బ్యాంకుల అధికారులు, సీనియర్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

రాములోరి సేవలో ముస్లిం

తనకల్లు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో చేపట్టే ఏ అభివృద్ధి కార్యక్రమానికైనా తనవంతు సాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కొర్తికోట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు ఎస్కే మస్తాన్‌వలి. ఆలయ నిర్మాణమైనా, అమ్మవారి ఊరేగింపు అయినా, సామూహిక సీమం తాలు, పేదల వివాహాలు ఇలా ఏ కార్యక్రమమైనా కులమతాలు, పార్టీలకు అతీతంగా చేయూత అందిస్తున్నారు. ముఖ్యంగా గ్రామంలో రామాలయ నిర్మాణానికి తనవంతు సహకారం అందించడమేకాకుండా రాములవారి విగ్రహ ప్రతిష్ఠ కోసం వేద పండితులను తీసుకొచ్చారు. మూడురోజులుగా గ్రామంలో కొనసాగుతున్న అన్నదాన కార్యక్రమాన్ని తానే ముందుండి నిర్వహిస్తున్నారు. ముస్లిం మతానికి చెందిన వారైనా హిందూ దేవుళ్ల సేవలో సాగుతున్న మస్తాన్‌వలిని పలువురు ప్రశంసిస్తున్నారు.



ఎస్కె మస్తాన్‌వలి



ప్రతిష్ఠించడానికి ప్రత్యేక పూజలు చేసిన రాములోరి విగ్రహాలు

ఐజీ ఆఫీస్‌కు ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్లు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిధిలో పనిచేస్తున్న ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్లను స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ కార్యాలయానికి బదిలీ చేశారు. రాయదుర్గం సబ్‌రిజిస్ట్రార్ శ్రీనివాసులు, పెనుకొండ సబ్‌రిజిస్ట్రార్ వెంకటనాయుడును డెప్యుటేషన్‌పై ఆరు నెలల పాటు ఐజీ కార్యాలయంలో విధులు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశారు. ఉరవకొండ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ జయదీప్, అనంతపురం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసే జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డిలను ఐజీ కార్యాలయానికి వెళ్లేలా ఆదేశాలందాయి. రాయదుర్గం ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్‌గా అనంతపురం జాయింట్-2సబ్‌రిజిస్ట్రార్ యూనస్‌ను, పెనుకొండలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న సురేష్ ఆచారికి అక్కడే ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

ఇన్‌ఫ్లో 823 క్యూసెక్కులు

బెళుగుప్ప, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 823 క్యూసెక్కులు ఉన్నట్లు మంగళవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 631 క్యూసెక్కులు వెళుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.681 టీఎంసీలు నీటి నిల్వ వుందని అధికారులు వెల్లడించారు.

న్యూస్ బాక్స్

21న ఉద్యోగ మేళా

కదిరి అర్బన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): తమ కాలేజీలో ఆంధ్ర ప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 21న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎస్‌టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ స్మిత మంగళ వారం ఓ ప్రకటనలో తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమా, ఎంటెక్, బీటెక్, పూర్తి చేసి 18 నుంచి 30 సంవత్సరాలలోపు ఉన్నవారు అర్హులన్నారు. ఉద్యోగ మేళాలో ఎంపికైనవారికి నెలకు రూ.12 వేల నుంచి రూ.20వేల వరకు వేతనం ఉంటుందన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 93901 76421ను సంప్రదించాలని సూచించారు.

తహసీల్దార్ డ్రైవర్ అవినీతిపై మంత్రి ఆరా

నివేదిక ఇవ్వాలని ఆర్డీఓకు ఆదేశం

బత్తలపల్లి ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కారు డ్రైవర్ బాషా అవినీతిపై బాధితులు సోమవారం ఆందోళన చేపట్టిన విషయం తెల్సిందే. పత్రికల ద్వారా విషయం తెలుసుకున్న మంత్రి సత్యకుమార్ మంగళవారం ఆర్డీఓకు ఫోన్ చేసి ఆరా తీశారు. విచారణ చేసి.. నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అంతే కాకుండా దీనిపై కలెక్టర్ కూడా ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. మంత్రి కార్యాలయ పీఏ హరీ‌ష్‌కుమార్ మంగళవారం బత్తలపల్లి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి.. తహసీల్దార్ స్వర్ణలతతో డ్రైవర్ అవినీతిపై ఆరాతీశారు. ఓ ప్రభుత్వ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తి దందా చేస్తుంటే ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. డ్రైవర్ బాషాకు ఇంకా ఎవరైనా డబ్బులు ఇచ్చి నష్టపోయిన వారు ఉంటే మంత్రి కార్యాలయ దృష్టికి తీసుకురావాలని కోరారు.

● ఆర్డీటీ ఆస్పత్రి పరిశీలన: స్థానిక ఆర్డీటీ ఆసుపత్రిని హరీష్ కుమార్ పరిశీలించారు. ఆరోగ్యమిత్ర బాలాజీ దురుసుగా ప్రవర్తిస్తున్నాడని రోగులు అతని వద్ద వాపోయారు. వెంటనే ఆయన ఆరోగ్య మిత్రల జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీదేవికి ఫోన్ చేసి బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రిలోని ఆరోగ్యమిత్రపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ కూలీలకు పనిచేసే ప్రాంతంలో సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కదిరప్ప కోరారు. మంగళవారం మండలంలోని ఎగువపల్లి వద్ద ఉపాధి కూలీలు పనిచేస్తున్న ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మట్లాడుతూ రోజురోజుకు ఎండ పెరుగుతోందని, పనిచేసే ప్రదేశంలో కూలీలకు నీడ, నీరు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట రమణ, కొండయ్య ఉన్నారు.

నేడు ఇంటర్వ్యూలు

కొత్తచెరువు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వివిధ కుల కార్పొరేషన్ల కింద స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నటరాజ్ తెలిపారు. ఉదయం 10గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో ముందు బీసీ కార్పొరేషన్ వారికి .. అనంతరం మిగిలిన కుల కార్పొరేషన్ల వారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

● ఓబుళదేవరచెరువు : వివిధ కులాల కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాబర్టు విల్సన్ మంగళవారం తెలిపారు. ఉదయం 10.30గంటకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. బుధవారం తంగేడుకుంట, అల్లాపల్లి, కొండకమర్ల, చింతమానుపల్లి, డబురవారిపల్లి, గురువారం ఓబుళదేవరచెరువు, ఇనగలూరు, మిట్టపల్లి, మామిళ్లకుంట్లపల్లి, సున్నంపల్లి, తిప్పేపల్లి, తులకుంట్లపల్లి, వెంకటాపురం పంచాయతీ వారికి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

21న వాటర్ షెడ్ యాత్ర

నంబులపూలకుంట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 21న వాటర్ షెడ్ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు అధికారి రవీంద్రారెడ్డి మంగళవారం తెలిపారు. జిల్లాలోని ఎన్పీకుంట మండలం వాటర్ షెడ్ పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారని, ఈ వాటర్ షెడ్ వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పిస్తామన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి.. బహుమతులు అందచేస్తామ న్నారు. కార్యక్రమానికి రైతులు, విద్యార్థులు హాజరుకావాలని కోరారు.

23న ఎమ్మార్పీఎస్ కార్యవర్గ సమావేశం

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల కార్యవర్గ సమావేశాన్ని ఈనెల 23న అనంతపురంలో నిర్వహిస్తున్నట్లు మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రనాథ్ మంగళవారం తెలిపారు. సమావేశంలో ఎస్సీ వర్గీకరణ అమలు, జరుగుతున్న పరిణామాలపై చర్చిస్తామన్నారు. ఈ సమావేశానికి అధిక సంఖ్యలో మాదిగలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

25న మెహర్‌బాబా అవతరణ ఉత్సవం

ధర్మవరం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక గిర్రాజుకాలనీలో అన్నపూర్ణేశ్వర ఆలయం ఎదురుగా ఉన్న అవతార్ మెహర్‌బాబా కేంద్రంలో అవతార్ మెహర్‌బాబా 131వ అవతరణ మహోత్సవాన్ని ఈనెల 25న నిర్వహిస్తున్నట్లు ఆ కేంద్ర కార్యదర్శి పెనుజూరి రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజున వివిధ సేవా కార్యక్రమాలు , ఉపన్యాసాల, గీతాలాపన, రక్తదాన శిబిరం ఉంటాయన్నారు.

శ్రీవారి సేవలో బీజేపీ నేత చికోటి ప్రవీణ్



ప్రవీణ్‌కు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

కదిరి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో స్వామివారిని తెలంగాణ బీజేపీ నాయకుడు చికోటి ప్రవీణ్ మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు కదిరి బీజేపీ నాయకులు తలుపుల గంగాధర్, వంశీకృష్ణ, కేశవరెడ్డి స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందించారు.

దరఖాస్తుల పరిశీలన

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా బీసీ రుణాల కోసం వచ్చిన దరఖాస్తులను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బ్యాంకు మేనేజర్లతో కలిసి పరిశీలించినట్లు ఎంపీడీఓ సాయిమనోహర్ మంగళవారం తెలిపారు. మండలవ్యాప్తంగా 327మంది రుణాల కోసం దరఖాస్తులు చేసుకోగా అందులో మొదటిరోజు 237మంది దరఖాస్తులను పరిశీలించామన్నారు.

బ్యాంక్ సేవలపై అవగాహన ర్యాలీ

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కెనరాబ్యాంక్ అందిస్తున్న సేవలపై రీజనల్ మేనేజర్ మురళీమోహన్ ఆధ్వర్యంలో పట్టణంలో మంగలవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కదిరి శాఖ చీఫ్ మేనేజర్ అనంతబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

చిగురించిన ఆశలు



సాధారణంగా జనవరి మొదటి వారంలో మామిడి పూత రావల్సి ఉంది. వాతావరణం అనుకూలించకపోవడంతో పూత రాలేదు. దీంతో మామిడి రైతులు నిరాశకు లోనయ్యారు. అంతేకాకుండా రెండు సంవత్సరాల నుంచి మామిడి దిగుబడి తగ్గడంతో ఈ సారి కూడా దిగుబడిపై ఆశలు వదిలేసుకున్నారు. అయితే ఫిబ్రవరిలో ఎండలు ఎక్కువగా ఉండడం.. వాతావరణం అనుకూలిండటంతో 90 శాతం మామిడి పూత విరబూసింది. దీంతో మామిడి రైతుల్లో ఆశలు చిగురించాయి. పూత పిందెలు అయితే మంచి దిగుబడి వచ్చే అవకాశముందని మామిడి రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. -గాండ్లపెంట(ఆంధ్రజ్యోతి)

తగ్గిన వేరుశనగ ధర



ఎన్పీకుంట వద్ద ఆరబోసిన వేరుశనగ

నంబులపూలకుంట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రబీలో బోరుబావుల కింద రైతులు సాగుచేసిన వేరుశనగ దిగుబడి రాగానే మార్కెట్‌లో ధర ఒక్కసారిగా పడిపోయింది. విత్తన సమయంలో 42కేజీల బస్తా రూ.3,200 నుంచి 3,500తో రైతులు కొనుగోలు చేసి పంటలు సాగుచేశారు. పంట విత్తన సమయంలో అధికంగా వర్షాలు కురవడంతో కలుపు అధికం కావడంతో కూలీల ఖర్చు పెరిగింది. ఎకరా వేరుశనగ కలుపు తీయడానికి రూ. పదివేలు ఖర్చు చేయాల్సి వచ్చింది. ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోయినా, పండి పంటను విక్రయించి, చేసిన అప్పులకు వడ్డీలు కట్టడానికి రైతులు కాయలను విక్రయించడానికి ప్రయత్నిస్తున్నారు. అయితే ధరలు తగ్గిపోయాంటూ వ్యాపారులు దాట వేస్తున్నారు. అప్పుల వారి ఒత్తిడి తట్టుకోలేక కొంతమంది రైతులు వచ్చిన కాడికి విక్రయి స్తున్నారు. 45.500 కేజీలు రూ.2,400 నుంచి 3.600 వరకు మార్కెట్‌లో ధర ఉంది. విత్తన నాణ్యతను బట్టీ ధరలు వ్యాపారులు ధర నిర్ణయి స్తున్నారు. కొనబోతే కొరివి, అమ్మబోతే అడవి అన్నచందంగా రైతుల పరిస్థితి తయారైంది. ప్రభుత్వమే తాము పండించిన వేరుశగను కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ తరగతులు ప్రారంభం



కొత్తచెరువులో మాట్లాడుతున్న డీఈఓ కిష్టప్ప

కొత్తచెరువు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి సర్టిఫికెట్ కోర్సు పేరుతో ఆరు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులను స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో డీఈఓ కిష్టప్ప మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లు చిన్నపిల్లలకు ఆటలపాటతో విద్య అందించాలన్నారు. అదేవిధంగా రాబోయే కాలంలో అంగన్‌వాడీలు బేసిక్ స్కిల్ డెవలప్‌మెంట్ విద్యార్థులకు నేర్పించాల్సి ఉంటుందన్నారు. అందులో భాగంగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జయచంద్ర, సూపర్‌వైజర్ పుష్పలత పాల్గొన్నారు.

● నంబులపూలకుంట: మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులను స్థానిక జడ్పీ స్కూల్లో మంగళవారం ప్రారం భించారు. ఇందులో ఎంఈఓలు గోపాల్‌నాయక్, సుబ్బిరెడ్డి, హెచ్ఎం శిరీష, డీఆర్‌పీ శిరీష, చిన్నరెడ్డెప్ప, మహేశ్వర్‌రెడ్డి, నాగేంద్ర, అంగన్ వాడీ సూపర్‌వైజర్లు నరసమ్మ, లక్ష్మి, మౌలాబీ పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా ఎంఈఓలు సురేష్‌బాబు, రమణ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీపీడీఓ సంపూర్ణ, శిక్షకులు రవి, లక్ష్మీనరసప్ప, రామ్‌కుమార్, అమరనాథ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి పాల్గొన్నారు.

శోకసంద్రంలో మల్కాపురం



శ్రీకాంత్ ఇంటి వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

విద్యార్థి శ్రీకాంత్ అనుమానాస్పద మృతితో గ్రామంలో విషాదఛాయలు

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్కాపురం గ్రామానికి చెందిన అక్కులప్ప, నారాయణమ్మ దంపతుల రెండో కుమారుడు శ్రీకాంత్ (17) అనంతపురంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అతను కళాశాల సమీపంలోని తోటలో మంగళవారం అనుమానాస్పద స్థితిలో మరణించాడు. అతని మరణ వార్తతో మల్కాపురం గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. సాయంత్రం విద్యార్థి శ్రీకాంత్ మృతదేహాన్ని గ్రామానికి తీసుకొనిరావడంతో కుటుంబసభ్యులు, బంధువులు బోరున విలపించారు. గ్రామస్థులు వారిని ఓదార్చారు. శ్రీకాంత్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

ఏడాదిగా.. నిరుపయోగంగా.. !

ప్రారంభానికి నోచుకోని సోమయాజులపల్లి హెల్త్ సెంటర్

గాండ్లపెంట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమయాజులపల్లి పంచాయతీలో హెల్త్ సెంటర్‌ను నిర్మించి.. దాదాపు సంవత్సరం అవుతోంది. అయినా దాన్ని ప్రారంభించకపోవడంతో.. అది నిరుపయోగంగా మారింది. రూ.21 లక్షలతో దీన్ని నిర్మించారు. కాంట్రాక్టర్లకు కొన్ని బిల్లులు రాకపోవడంతో ఆ భవనాన్ని అతను అధికారులకు అప్పగించలేదు. ఈ విషయంపై పాలకులు,అధికారులు కూడా చొరవ చూపకపోవడంతో ఏడాదిగా ఇలా.. నిరుపయోగంగా ఉండిపోయింది. దీనిపై డాక్టర్ మహేశ్వర్‌మారుతిని వివరణ కోరగా.. సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో అతను ఆ భవనాన్ని మాకు స్వాధీనం చేయలేదని చెప్పారు.



నిరుపయోగంగా ఉన్న సోమయాజులపల్లి హెల్త్ సెంటర్

పొలాలకు దారి చూపండి

నల్లమాడ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులగంపల్లి గ్రామానికి చెందిన రైతులు తమ పొలాలకు దారి చూపాలని తహసీల్దార్ రంగనాయకులకు మంగళవారం వినతిపత్రం అందించారు. పూర్వం తాత ముత్తాతల నుంచి గ్రామం నుంచి పొలాలకు వెళ్లడానికి దారి ఉండేదన్నారు. అదేగ్రామానికి చెందిన నారా యణరెడ్డి కుమారుడు మునిరెడ్డి మూడు రోజుల క్రితం ఆ దారిన ఎవరూ వెళ్లకూడదని దారికి అడ్డంగా కాలువ తీయించాడని వాపో యారు. దీంతో రాకపోకలు పూర్తిగా నిలిచి పోయాయన్నారు. చట్టప్రకారం కొలతలు వేసి తమ పొలాలకు దారి చూపించాలని రైతులు కోరారు. అలాగే దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. స్పందించిన తహసీల్దార్ గ్రామా నికి వచ్చి.. పరిశీలించి సమస్యను పరిష్క రిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రవిచంద్రారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మహబూబ్‌బాషా, హమీద్ పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న పులగంపల్లి రైతులు

కొడవళ్లతో దాడి

బత్తలపల్లి ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పర్లపల్లి సమీపంలో గుమ్మల్లకుంట గ్రామానికి చెందిన నరేంద్రపై ఇద్దరు వ్యక్తులు కొడవళ్లతో ఆదివారం రాత్రి దాడి చేశారు. నరేంద్ర, మరో పది మంది ఒక గ్రూప్‌గా ఏర్పడి.. బ్యాండ్ మేళం వాయిస్తూ.. జీవనం సాగించేవారు. అదే గ్రూప్‌లోని కోడేకండ్ల నారాయణస్వామి, నరేంద్ర మధ్య విభేదాలు వచ్చాయి. ఆదివారం రాత్రి నారాయణస్వామి, అతని మిత్రుడు గరశనపల్లికి చెందిన సందీప్ కలిసి.. ఉప్పర్లపల్లి క్రాస్ వద్ద నరేంద్రపై కొడవళ్లతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడ్డ నరేంద్రను స్థానికులు ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. సోమవారం రాత్రి అతని ఫిర్యాదు మేరకు హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సోమశేఖర్ మంగళవారం తెలిపారు.

సీజీపీ చేపల సొసైటీ ఏకగ్రీవం



ఎమ్మెల్యే కందికుంటను సన్మానిస్తున్న సొసైటీ సభ్యులు

తనకల్లు, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నస్వామి గుడి ప్రాజెక్టు చేపల సొసైటీని మంగళ వారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల మూడేళ్లుగా వాయిదా పడుతూ వచ్చాయి. సీజీపీలో చేపల పెంపకం కొనసాగుతున్నా, చేపలు పట్టడానికి సొసైటీలో విబేధాల కారణంగా ఎన్నికలు వాయిదా పడుతూ వచ్చాయి. ప్రస్తుతం టీడీపీ నాయకులు చేపల సొసైటీ లోని సభ్యులతో చర్చించి, ఏకగ్రీవానికి కృషిచేశారు. సొసైటీ అధ్యక్షుడిగా నాగరాజు, ఉపాధ్యక్షుడిగా గోపాల్, కార్యదర్శిగా శీనానాయక్, డైరెక్టర్లుగా మునుస్వామి, క్రిష్టప్ప, వెంకటరమణ, నాయక్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సభ్యులు కదిరి ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపి, సన్మానించారు. అలాగే ఏకగ్రీవానికి కృషి చేసిన టీడీపీ నాయకులు శ్రీరాములనాయక్, శంకర్‌నాయుడు, ఈశ్వర్‌రెడ్డి, రాజా రెడ్డి,విదుర శేఖర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



విద్యార్థులతో ఎమ్మెల్యే, మాజీ మంత్రి

విద్యతోపాటు సంస్కారమూ నేర్పాలి

కొత్తచెరువు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి):, విద్యార్థులకు బాల్యం నుంచే విద్యతో పాటు సంస్కారాన్నీ నేర్పాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సిల్వర్ లైన్ ఇంగ్లీషు మీడియం స్కూల్ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో విద్యార్థులకు నైతిక విలువలు సన్నగిల్లుతున్నాయన్నారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో విజేత చిన్నారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ షాకీరా, అబ్దుల్లా, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

ముదిగుబ్బ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలం కొండగట్టుపల్లి పంచాయతీ పాయగట్టుపల్లి గ్రామానికి చెందిన నాగేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతనికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ. 37 వేలు మంజూరైంది. ఆ చెక్‌ను ధర్మవరంలోని మంత్రి కార్యాలయంలో ఇన్‌చార్జ్ హరీష్‌బాబు నాగేశ్వరరావుకు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం బీజేపీ పట్టణ అధ్యక్షుడు జింక చంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు సాకే ఓబులేషు, పోతుకుంట రాజు పాల్గొన్నారు.

రైల్వే గేటు మూసివేత

ముదిగుబ్బ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ముదిగుబ్బ నుంచి పుట్టపర్తికి వెళ్లే రహదారిలో ఉన్న పాతూరుగేట్‌కు మరమ్మతుల కారణంగా ఈ నెల 22, 23 తేదీల్లో మూసివేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీనియర్ కదిరి సెక్షన్ ఇంజనీర్ అప్సార్‌బాషా తెలి పారు. వాహనాలకు ప్రత్యామ్నాయ దారి ఏర్పాటు చేయాలని ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్, ముదిగుబ్బ తహసీల్దార్ నారాయణస్వామి, సీఐ శివరాముడుకు సమాచారం ఇచ్చామన్నారు.

షేడ్ నెట్ వినియోగంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నరసయ్య

తనకల్లు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): తనకల్లు, నల్లచెరువు మండలాలకు చెందిన రైతులకు షేడ్ నెట్ వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని స్థానిక చౌడేశ్వరీ మండల మహిళ సమాఖ్య కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. జిల్లా హార్టికల్చర్ అధికారి చంద్రశేఖర్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీపీఎం రామమోహన్ ఇందులో మాట్లాడారు. షెడ్‌నెట్ వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ఉద్యానవనశాఖ ద్వారా అందిస్తున్న వివిధ రకాల రాయితీలను వివరించారు. మహిళ సంఘాల్లోని సభ్యులు షెడ్‌నెట్లను ఉపయోగించి ఆకుకూరలు, కూరగాయాలు పండించి ఆర్థికంగా లబ్ధిపొందాలని సూచించారు. ఇందుకు అవసరమైన నిధులను సంఘాల ద్వారా రుణాలు ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏరియా కో-ఆర్డినేటర్ రవీంద్ర, ఎఫ్‌పీఓఏపీఎం రమణప్ప, ఏపీఎం జయంతి, ఉద్యానవనశాఖ మండలాధికారి లావణ్య, టీడీపీ కన్వీనర్ తొట్లి రెడ్డిశేఖర్‌రెడ్డి, కేతు సంస్థ ప్రతినిధి గణేష్, జనజాగృతి ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

కదిరి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తూ మరణించిన నర్మదమ్మ జ్ఞాపకార్థం ఆమె భర్త శ్రీధర్‌రెడ్డి ప్రతిభావంత విద్యార్థులకు నగదు ప్రోత్సహక బహుమతులు అందజేశారు. మండలంలో గత సంవత్సరం పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన చరిత్రశ్రీ, రిమాతబుసుమ్‌లకు ఒక్కొక్కరికి రూ. ఐదువేలు చొప్పున స్థానిక ఎంఈఓ కార్యాలయంలో మంగళవారం అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ చెన్నక్రిష్ణ, ఉపాధ్యాయురాలి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సబ్ జైలు తనిఖీ



ఖైదీలతో మాట్లాడుతున్న శివప్రసాద్ యాదవ్

ధర్మవరం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ధర్మవరం సబ్‌జైలును జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్ మంగళవారం తనిఖీ చేశారు. జైలులో ఉన్న ఖైదీలతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. జైలు గదులు, వంటగదిని పరిశీలించారు. ఎవరికైనా న్యాయవాది లేకపోతే ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటుచేస్తామని ఖైదీలకు సూచించారు. కార్యక్రమంలో సబ్‌జైలర్ బ్రహ్మంరెడ్డి, న్యాయవాదులు బాలసుందరి, బిల్లేరవి, పారాలీగల్ వలంటీర్ షామర్‌బాషా, సబ్‌జైలు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బీజేపీ ఆధ్వర్యంలో ర్యాలీ

ధర్మవరం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ 398 జయంతి సందర్భంగా బుధవారం సాయంత్రం పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బీజేపీ నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గాంధీనగర్ చౌడేశ్వరి దేవాలయం నుంచి గాంధీనగర్, పాండురంగ, కళాజ్యోతి సర్కిల్ మీదుగా కాలేజ్ సర్కిల్‌కు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అక్కడ ఛత్రపతి శివాజి చిత్రపటానికి బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్, పట్టణ అధ్యక్షుడు జింకా చంద్రశేఖర్, నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తారని అన్నారు.

ముందస్తు వేసవి

● పురంలో అప్పుడే ప్రారంభమైన నీటి సమస్య

● 15 రోజులకోమారు కొళాయి నీరు

● ట్యాంకుల ద్వారా కొనాల్సిందేనంటున్న గృహిణులు



హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): హిందూపురం అంటేనే రాష్ట్ర వ్యాప్తంగా ముందుగా అందరికి గుర్తుకు వచ్చేది నీటి సమస్య. ఈ సమస్య పరిష్కారానికి 2014లో రూ. 194 కోట్లతో గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి హిందూపురంకు ప్రత్యేక పైప్‌లైను వేశారు. దాని ద్వారా లిఫ్టులు ఏర్పాటుచేసి పట్టణానికి నీరందించే వారు. అంత వరకు బాగానే ఉంది. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చెడిపోయిన మోటార్లు, విద్యుత్ ప్యానల్‌ల మరమ్మతులు సక్రమంగా చేపట్టకపోవడంతో నీటి సమస్య ప్రారంభమైంది. పుష్కలంగా వర్షాలు కు రిసి నీరు అందుబాటులో ఉన్నా ప్రజలకు నీరందించడంలో మునిసిపల్ శాఖ విఫలమైంది. ఇప్పుడు వేసవి మొదలవుతుండగానే అప్పుడే నీటి సమస్య తలెత్తింది. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నీరు రావడంలేదని సిబ్బంది చెబుతుండగా, అధికారులైతే నీరు వస్తుందని అంటున్నారు. మరి నీరు సక్రమంగా సరఫరా అయితే పట్టణంలో నీటి సమస్య ఎందుకు ఉత్పన్నమవుతోందని ప్రజలు నిలదీస్తున్నారు. హిందూపురంలోని నానెప్పనగర్, లక్ష్మీపురం, డిబి కాలనీ, డిఆర్ కాలనీ తదితర ప్రాంతాలకు నీరు సక్రమంగా సరఫరా కావడంలేదు. 15 రోజులకో మారు మాత్రమే నీరు వదులుతున్నారు. అది కూడా కేవలం రెండు డ్రమ్ముల కంటే ఎక్కువ రావడంలేదు. కొళాయిల నుంచి వచ్చిన నీరు నాలుగు రోజులకు మించి వినియోగించలేకపోతున్నారు. దీంతో ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా నీరు డబ్బు పెట్టి కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక పక్క మునిసిపాలిటీకి కొళాయి పన్ను కడుతూ మరో పక్క ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా నీరు కొనుగోలు చేయాలంటే ఇబ్బందిగా ఉందని ప్రజలు ఆగ్రహిస్తున్నారు. ఇప్పుడే ఇలాగుంటే ఇక ఎండలు ముదిరితే పరిస్థితి ఎలాగుంటుందో అని చర్చించుకుంటున్నారు. ఈ విషయంపై వివరణ కోరుదామని మునిసిపల్ కమిషనర్‌కు ఎన్ని సార్లు ఫోన్ చేసినా ఆయన స్పందించడంలేదు. సమస్యలపై ప్రజలు మునిసిపల్ కార్యాలయానికి వెళ్ళినా ఆయన పట్టించుకోరని అంటున్నారు. ఇలాగైతే ప్రజా సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

నెలలో మూడు ట్యాంకులు కొంటున్నాం



సుమిత్ర, గృహిణి

15 రోజులకు ఒకమారు నీరు వస్తుంది. అది కూడా చాలీచాలని విధంగా వస్తున్నాయి. దీంతో ట్యాంకర్ల ద్వారా కొనుక్కుంటున్నాము. నీటికి వారానికి రూ. రెండు వందల దాకా ఖర్చవుతుంది. మరి కుటుంబం ఎలా గడవాలి. అందిరితో పాటు నీటి పన్నులు చెల్లించి నీరు ఎప్పుడొస్తుందా అని ఎదురు చూడాల్సిన పరిస్థితి దాపురించింది.

ఎంత మంది కౌన్సిలర్లు మారినా ప్రయోజనం శూన్యం



రాజశ్రీ, నానెప్పనగర్

పట్టణంలోని నానెప్ప నగర్‌కు 15 రోజులకు ఒక మారు మాత్రమే నీరు వస్తుంది. ఎంత మంది కౌన్సిలర్‌లు ఇక్కడ నుంచి గెలుపొందినా వారందరికి మా గోడు వినిపించాము. ఎన్నికలప్పుడు కనిపించి అది చేస్తాం, ఇది చేస్తాం అంటారు. అంతే మరలా కనిపించరు. మాకు కష్టాలు మాత్రం తప్పడంలేదు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

● ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్య తలెత్తకుండా శాశ్వతంగా సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టాలని, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. ఆర్అండ్‌బీ అతిథిగృహ ఆవరణలో మంగళవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలిసి నియోజకవర్గంలోని ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోకపోతే అలాంటి వారిపై కఠినచర్యలు తప్పవన్నారు. తాగునీటి సమస్యకు వచ్చిన నిధులను కేవలం ఆ సమస్య పరిష్కారం కోసమే వెచ్చించాలన్నారు. ఐదు మండలాల పరిధిలో తాగునీటి సమస్య ఉందని ఐదు మండలాల్లో ఖాళీ బిందెలతో మహిళలు రోడ్డెక్కితే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అనంతరం బీసీవెల్ఫేర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. హాస్టల్‌లో సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకొంటున్న చర్యల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, పెనుకొండ బీసీ వెల్ఫేర్ అధికారి గంగాధర్ పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలో కక్షపూరిత చర్యలకు తావులేదు

ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో ఎప్పుడూ కక్షపూరిత చర్యలకు తావులేదని, అలాంటిది ఖూనీలు చేసే ముఠా నాయకుడు వంశీపై జగన్‌కు ఎందుకు అంతప్రేమ అని టీటీడీ బోర్డు సభ్యులు, ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు ప్రశ్నించారు. మంగళవారం ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలిసి విలేకరులతో మాట్లాడారు. కక్ష సాధింపు చర్యలు చేస్తే కొడాలినాని, పేర్ని నాని, ద్వారంపూడి, రోజా, వీరందరూ బయట తిరగగలరా అని ప్రశ్నించారు. దళితుల జీవితాలతో చెలగాటం ఆడేవారికి జగన్ అండగా నిలవడాన్ని బట్టి చూస్తే దళితులపై ఆయనకు ఉన్న ప్రేమ తేటతెల్లం అవుతుందన్నారు. వాస్తవాలు తెలియకుండా మాజీ ఐపీఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడటం ఎంతవరకు న్యాయం అన్నారు. దళితులను చంపి డోర్‌డెలివరీ చేసిన వారిని జగన్ ఎప్పుడూ ప్రేమిస్తారన్నారు. దమ్ముంటే జగన్‌కు అసెంబ్లీకి రావాలని, అసెంబ్లీలో చర్చిద్దామన్నారు. తెలంగాణలో రాజకీయాలు చేసుకొనే వారికి ఏపీలో రాజకీయాలు ఎందుకు అని ప్రవీణ్‌కుమార్ తీరుపట్ల మండి పడ్డారు. చివరకు మంత్రి నారా లోకేష్ పాదయాత్రను అడ్డుకొనేందుకు జీవనెంబర్ ఒకటిని తీసుకొచ్చారని, ఇలాంటి వారు ఈనాడు నీతులు మాట్లాడుతున్నారన్నారు. ఈసందర్భంగా మండల కన్వీనర్లు గణేష్, లక్ష్మీనారాయణ, కుమారస్వామి, తదితరులు ఉన్నారు.

మండలకేంద్రాల్లో కమ్యూనిటీ భవనాలు నిర్మించాలి



మాట్లాడుతున్న నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోట సదాశివం

గోరంట్ల, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి):జిల్లాలోని ప్రతి మండలకేంద్రంలోనూ నాయీబ్రాహ్మణుల కమ్యూనిటీ భవనం కోసం రూ.పదిలక్షల నిధులు మంజూరు చేయాలని నాయీబ్రాహ్మణులు డిమాండ్ చేశారు. మండలంలోని జీనవాండ్లపల్లి వద్ద మంగళవారం సత్యసాయి జిల్లా నాయీబ్రాహ్మణుల విజయభేరి సభ నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటిసదాశివం, టీటీడి సాధికార కమిటి డైరెక్టర్ శాంతరామ్, మాజీ ఎంపీ నిమ్మలక్రిష్టప్ప, బీజేపీ జిల్లా అధ్యక్షులు జీఎం శేఖర్ హాజరయ్యారు. కమ్యూనిటీ భవనంతోపాటు నాయీబ్రాహ్మణుల సెలూన్‌కు 250యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వాలని, నగర పాలక సంస్థ, పంచాయతీ షాపింగ్ కాంప్లెక్సు గదుల కేటాయింపులో తమకు ప్రాధాన్యం కల్పించాలన్నారు. ఈ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చైర్మన్ రుద్రకోటి సదాశివం తెలిపారు. నాయీబ్రాహ్మణుల అభివృద్ధికి టీటీడీ నుంచి నిధులు సమకూరేలా చర్యలు చేపడతామని డైరెక్టర్ శాంతరామ్ తెలిపారు. ప్రభుత్వం ద్వారా సహకారం అందిస్తామని నిమ్మలక్రిష్టప్ప, జీఎం శేఖర్ పేర్కొన్నారు.

సపోటా చెట్లకు నిప్పు.. రూ.3 లక్షలు నష్టం



కంచిసముద్రంలో కాలిపోతున్న సపోటా చెట్లు

లేపాక్షి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఆకతాయిలు నిప్పు పెట్టడంతో పది ఎకరాలలోని సపోటా చెట్లు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. కంచిసముద్రం గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు కంచిసముద్రం గ్రామం వద్ద వున్న బిజెడ్పీ హైస్కూల్ వద్ద బెంగళూరుకు చెందిన శివమూర్తి అనే భూస్వామి 10 ఎకరాలలో సపోటా చెట్లను సాగు చేశాడు. మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు తోటలోనికి వెళ్లి కాయలను కోసి తోటకు నిప్పు పెట్టారు. దీంతో 10 ఎకరాలలోని సపోటా చెట్లు మొత్తం కాలిఆపోయాయి. రైతుకు దాదాపు రూ.3లక్షలు నష్టం వాటిల్లినట్లు గ్రామస్తులు తెలిపారు.

వానవోలులో కందికాయ వాముల దగ్ధం

గోరంట్ల, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వానవోలు తండాకు చెందిన రైతులు కల్లంలో కందిపంటను కోసి నిలువ ఉంచగా, మంగళవారం అగ్నిప్రమాదంలో కందికాయవాములు కాలిబూడిదయ్యాయి. ఈప్రమాదంలో దాదాపు రూ.లక్షల నష్టం జరిగిందనట్లు అంచనా. వానవోలు తండాకు చెందిన సోమ్లానాయక్, తిప్పేనాయక్, రామచంద్రనాయక్ తదితర రైతులకు చెందిన పది ఎకరాల్లో సాగుచేసిన కంది పంట అగ్నికి ఆహుతైంది.

మహిళ ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకటరమణపల్లి గ్రామానికి చెందిన మహిళ భారతి కుటుంబ కలహాలతో మంగళవారం రాత్రి ఆత్మహత్యకు యత్నించింది. భర్త నారాయణతో మనస్పర్థల కారణంగా టమోటా పంటకు వాడే క్రిమి సంహారక మందును తాగింది. అస్వస్థతకు గురైన ఆమెను కుటుంబ సభ్యులు గోరంట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వరకట్న వేధింపులపై కేసు

కూడేరు, ఫిబ్రవరి 18, (ఆంధ్రజ్యోతి): వరకట్నం కోసం అత్తారింటి వేధింపులు భరించలేక మహిళ కూడేరు పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు అందించిన వివరాల మేరకు కూడేరుకు మండలానికి చెందిన మేఘన హిందూపురం రూరల్ మండలం బలంపల్లికి గ్రామానికి చెందిన రఘువీరరెడ్డిలు 2022 సంవత్సరంలో కియా కంపెనీలో పనిచేస్తూ ప్రేమించుకున్నారు. ఇద్దరి కులాలు వేరు కావడంతో కులాంతర వివాహానికి పెద్దలను ఒప్పించి 2022వ సంవత్సరం జూన్ నెలలో పెళ్లి చేసుకున్నారు. వివాహమైన ఏడాదికి కుమారుడు పుట్టిన తర్వాత మేఘనకు వరకట్నం వేధిపులు మొదలయ్యాయి. కట్నం తీసుకురావాలని మేఘన భర్త రఘువీరరెడ్డి, అత్త సువర్ణమ్మ, మామ అమరనారాయణరెడ్డిలు వేధిస్తున్నట్లు కూడేరు పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త, అత్త, మామలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పరిగి మండలమీట్‌కు ఇరిగేషన్ డీఈ గైర్హాజరు

పరిగి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఇరిగేషన్ డీ.ఈ. గైర్హాజరు కావడంపై పరిగి మండల కేంద్రంలో మంగళవారం జరిగిన సమావేశంలో ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎంపిపి సవిత ఆధ్వర్యంలో జరిగిన ఈ సర్వసభ్య సమావేశాలకు ఇరిగేషన్ డీఈ హాజరు కాకపోవడంతో పాటు నాయకులు ఫోన్‌లో ఏదైనా సమాచారం కోసం ప్రయత్నిస్తే ఆయన నుండి ఎటువంటి స్పందన రావడం లేదన్నారు. ఎంపిడీఓ .శ్రీధర్ జరుగుతున్న సమావేశం నుండి చరవాణి ద్వారా వివరణ కోరగా పలు సమస్యల కారణంగా అందుబాటులోకి రాలేదు. ఈ విషయమై ప్రజాప్రతినిదులు సర్వసభ్య సమావేశాన్ని కొద్దిసేపు బహిష్కరించారు. ఎంపీడీఓ చొరవతో కొద్దిసేపటి తర్వాత సభ యధావిధిగా జరిగింది. పరిగి నుండి తిరుమలదేవరపల్లికి బస్సు సౌకర్యం లేక దాదాపు 40 మంది విద్యార్థులు కాలినడకతో వస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారని బస్సు సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులకు తెలిపారు.

పాఠశాల ఆవరణలో వ్యక్తి మృతి

లేపాక్షి, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కంచిసముద్రం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో అదే గ్రామానికి చెందిన వాల్మీకి రామచంద్రప్ప (46) సోమవారం రాత్రి మృతిచెందాడు. దీనిపై కొంతమంది పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ నరేంద్రఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భార్య రమాదేవి మాట్లాడుతూ తన భర్త తరచూ అనారోగ్యానికి గురవుతున్నాడని పాఠశాల ఆవరణలోకి వెళ్లి అక్కడే మృతి చెందారన్నారు. ఆయనకు ఇద్దరు కుమారులువున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాలసముద్రం పంచాయతీ మిషన్ తండాకు చెందిన యువకుడు రమేష్‌నాయక్ మంగళవారం ఆత్మహత్యాయత్నం చేశాడు. శ్రీనివాస్‌నాయక్ కుమారుడైన రమేష్‌నాయక్ డీజిల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పు అంటించుకోగా వెంటనే కుటుంబ సభ్యులు మంటలను ఆర్పి, గాయపడిన అతడిని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ ఉషా చికిత్సలు చేసి, మెరుగైన చికిత్స కోసం 108లో హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

ఎస్సీ, ఎస్టీ కేసు విచారణ

అమరాపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): హాలుకూరు గ్రామంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఎస్సీఎస్టీ కేసు దర్యాప్తులో భాగంగా పెనుకొండ డీఎస్పీ వై.వెంకటేశ్వర్లు మంగళవారం సాక్షులను విచారించారు.

న్యూస్ బాక్స్

సంక్షేమ హాస్టళ్లలో సర్వసౌకర్యాలు



వార్డెన్‌లకు సూచనలు ఇస్తున్న ఏఎస్‌డబ్ల్యూఓ సుబ్బరాయుడు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 18, (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల వారికి సంబంధించిన సంక్షేమ హాస్టళ్లలో అన్ని సౌకర్యాలు సక్రమంగా అందేలా చూడాలని బీసీ వెల్ఫేర్ ఏఎస్‌డబ్ల్యూ సుబ్బరాయుడు పేర్కొన్నారు. బెంగళూరు రోడ్డులోని బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో మంగళవారం హిందూపురం పరిధిలోని వార్డెన్‌లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవతరగతి చదువుతున్న విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా వార్డెన్‌లు దృష్టి సారించాలన్నారు. మంచి నాణ్యమైన రుచికరమైన భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో వార్డెన్‌లు ఓబులరెడ్డి, సుధ, సరస్వతి, చిన్నయబాబు, చాంద్‌భాష, సిబ్బంది పాల్గొన్నారు.

బోధన.. పిల్లలను ఆకట్టుకోవాలి



కార్యక్రమానికి హాజరైన అంగన్‌వాడీ కార్యకర్తలు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి,18(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లాలంటేనే చిన్నారులు ఇష్టపడేలా కార్యక్రమాలు ఉండాలని ఎంఈఓ గంగప్ప తెలిపారు. స్థానిక ఎంజీఎం పాఠశాలలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ సందర్భంగా ప్రీ స్కూల్ నుంచి అభ్యసనా పద్ధతులు ఏ విధంగా చేపట్టాలి అనే అంశంపై కార్యకర్తలకు తర్ఫీదు ఇచ్చారు. ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు శిక్షణా తరగతులు ఉంటాయన్నారు.

గోరంట్ల: పట్టణంలోని బాలికల ఉన్నతపాఠశాలలో అంగన్‌వాడీకార్యకర్తలకు మంగళవారం జ్ఞానజ్యోతి శిక్షణను నిర్వహించారు. మండలంలోని 131 అంగన్‌వాడీకేంద్రాల కార్యకర్తలు పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భాషాభివృద్ధి, మౌలిక మెలుకువలు తదితరాంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు సోమందేపల్లి సీడీపీఓ రాజేశ్వరీ తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంఇఓలు జాన్‌రెడ్డెప్ప, గోపాల్ పాల్గొన్నారు.

గుడిబండ: గుడిబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీలకు మంగళవారం శిక్షణ ఇచ్చారు.

ఉన్నత పాఠశాలకు అపూర్వ వితరణ

గోరంట్ల, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బాలికల ఉన్నతపాఠశాల సౌకర్యార్థం పూర్వ విద్యార్థులు మైక్‌సెట్‌ను మంగళవారం వితరణ చేసినట్లు హెచ్ఎం మాధవిలత ఓప్రకటనలో తెలిపారు. ఈపాఠశాలలో 1974-75లో పది చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఉపాధ్యాయుల అభ్యర్థన మేరకు పాఠశాలకు మైక్‌సెట్ ఇస్తామని వారు హామీ ఇచ్చారు. ఈమేరకు పూర్వ విద్యార్థులు రిటైడ్ ఆర్డీఓ జీవి. విశ్వనాథ్, రిటైడ్ టీచర్ క్రిష్టారెడ్డి, సోమునాథ్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, రవీంద్రానాథ్‌ఠాగూర్, ఖాజామీయాలు పాఠశాలకు వెళ్లి మైక్‌సెట్‌ను అందించారు. హెచ్ఎంతోపాటు, ఉపాధ్యాయులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

హిందూపురం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఆసుపత్రి పాలై ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరం లాంటిదని టిడీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే బాలకృష్ణ నివాసంలో సిఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు అనారోగ్యం బారినపడి వారికి ఆరోగ్యశ్రీ వర్తించకపోతే అలాంటి వారికి సీఎం సహాయ నిధి ఎంతగానో ఉపయోపడుతుందన్నారు. 8లక్షలకు పైగా సహాయనిధి ఒక్కరికే ఇచ్చారన్నారు. ఏడు నెలల వ్యవధిలో నియోజకవర్గానికి రూ.1.50కోట్లకు పైగా సహాయ నిధి అందించామన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



ప్రకృతి వ్యవసాయం గురించి వివరిస్తున్న నిర్వాహకులు

గోరంట్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వానవోలు గ్రామంలో ప్రకృతి వ్యసాయంపై మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. కావేరి గ్రామైక్య సంఘం సభ్యులు, రైతులకు డ్రైసోయింగ్ గురించి వివరించారు. రైతు ఇనయతుల్లా రెండుఎకరాల పొలంలో ప్రకృతి వ్యవసాయానికి అనుగుణంగా ఐదు రకాల ప్రధాన పంటలు, 20రకాల బయోడైవర్‌సిటీ విత్తనాలు చల్లి ప్రకృతి వ్యవసాయం గురించి మెలుకువలు తెలిపారు. ఈకార్యక్రమంలో వానవోలు సీసీ రవి, యూనిట్ ఇన్‌ఛార్జీ నరసింహమూర్తి, సైదావలీ, సిఆర్పీలు, మ హిళ రైతులు, పాల్గొన్నారు.

ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలి

గోరంట్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : సంపద నిర్మితకేంద్రాల ద్వారా చెత్తనుంచి సంపదను తయారు చేస్తూ, ప్రజలందరికి మంచి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందచేయడానికి కృషి చేయాలని డీపీఓ సమత పేర్కొన్నారు. మంగళవారం గోరంట్లలోని రావికుంట వద్దగల డపింగ్‌యార్డును మోడల్‌గా ఎంపిక చేసి, శిక్షణను ఏర్పాటు చేశారు. ఈశిక్షణకు డీపీఓతోపాటు పెనుకొండ, పుట్టపర్తి, కదిరి డిఎల్‌పీఓలు శివనారాయణ, కేశవరెడ్డి, అంజనప్పలు హాజరైయ్యారు. డిపిఆర్‌సి జిల్లా కోఆర్డినేటర్ సంజనా శిక్షణద్వారా తడి, పొడి చెత్త, ప్రమాదకరమైన చెత్తలను విడిగా సేకరించడం ద్వారా సంపద ఎలాతయారుచేయాలో వివరించారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించండి

హిందూపురం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీడీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ శ్రీనివాస్‌రావుకు, మునిసిపల్ ఛైర్మన్ రమేష్‌కు చేనేత కార్మికులు వినతి పత్రం అందజేశారు. మంగళవారం ఎమ్మెల్యే నివాసం వద్ద చేనేత ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేనేత కార్మికులు వినతిని అందజేసి మాట్లాడుతూ సిల్క్ సబ్సిడీ పథకాన్ని పునరుద్ధరించాలని కోరారు. అదేవిధంగా 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వాలన్నారు. గత బడ్జెట్‌లో చేనేతల కోసం విద్యుత్ పథకానికి ఆమోదం తెలిపారు. కాని జీవో విడుదల కాలేదన్నారు.

ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

పెనుకొండ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ట్రాన్స్‌పోర్ట్ రంగం జిల్లా కార్యదర్శి బాబావలి డిమాండ్ చేశారు. పట్టణంలో ఆటో కార్మికులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం తర్వాత కీలకమైన రంగం ట్రాన్స్‌పోర్ట్ రంగం అన్నారు. చదువుకున్న నిరుద్యోగులు ఉపాధిలేక స్వయం ఉపాధితో అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నారన్నారు. అనేక ట్యాక్స్‌ల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం ఆటో కార్మికులు ఇస్తున్నారన్నారు. కాని ప్రభుత్వం మాత్రం వారికి ఎలాంటి రాయితీలు సంక్షేమ పథకాలు ఇవ్వడం లేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్‌న ఆయకులు హనుమంతు, రవీ నాయక్ క్రిష్ణ, సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించండి

పెనుకొండ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఎన్నికలలో ఇచ్చిన హామీల మేరకు పెండింగ్ డీఏలు 30 శాతం, మధ్యంతర భృతి ప్రకటించాలని స్కూల్ టీచర్స్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాడిశెట్టి శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలోని మావటూరు, అడదాకులపల్లి బండ్లపల్లి నాగలూరు, పెనుకొండ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఆలస్యమైనందున వెంటనే 12వ పిఆర్‌సి కోసం కమిటీనివేసి 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. పెరిగిన ధరలతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రాథమిక ఉన్నత పాఠశాలలను రద్దు చేయాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలకు సహాయకులను నియమించాలన్నారు. క్లస్టర్ సమావేశాలు సగం రోజు కాకుండా పూర్తి రోజు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్ కుమార్, మండలప్రధాన కార్యదర్శి బాబు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

సబ్ జైలు తనిఖీ

పెనుకొండ, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి): పెనుకొండ సబ్‌జైల్‌ను అనంతపురం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ అధికారి శివప్రసాద్ యాదవ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సబ్‌జైల్‌లోని టాయిలెట్లు, వంట గదులు, స్టోర్ రూము, రికార్డులను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడుతూ ప్రస్తుతం సబ్‌జైలులో వున్న ఖైదీలు విడుదల అయిన తర్వాత సత్ ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ జైలు ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, అశ్వర్థనారాయణ నరసప్ప, ప్యారాలీగల్ వాలంటీర్లు, అనంతపురం కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

సోమందేపల్లి, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి):కార్పొరేషన్ రుణాలకోసం దరఖాస్తుచేసుకున్న అభ్యర్థులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ నరేంద్రకుమార్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్నఅభ్యర్థులు సర్టిఫికెట్లనకళ్లను తీసుకు రావాలన్నారు.

రెండు ఆలయాల్లో చోరీ

హిందూపురం, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెండు ఆలయాల్లో సోమవారం రాత్రి చోరీలు జరిగాయి. శ్రీకంఠపురంలోని శివాలయంలో అర్ధరాత్రి దాటాక తలుపుల తాళాలు పగలకొట్టి దొంగలు లోపలికి ప్రవేశించారు. అయితే పక్కన నివాసం వున్న వారు శబ్దాలకు లేచి కేకలు వేయడంతో దుండగులువెళ్లిపోయారు. అయితే శ్రీకంఠపురంలోని పులమతి రోడ్డులో వున్న గంగమ్మ ఆలయంలో దొంగలు ప్రవేశించి హుండీను ధ్వంసం చేసి నగదును ఎత్తుకెళ్లారు. అయితే హుండీలో ఎంత మొత్తం ఎత్తుకెళ్లింది అర్చకులు పోలీసులకు చెప్పలేక పోయారు. మంగళవారం ఉదయం ఆలయాలు పరిశీలించి కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

హాస్టల్ వార్డెన్‌పై కేసు నమోదు చేయాలి

గుడిబండ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మందలపల్లి బీసీ బాలుర హాస్టల్ వార్డెన్ కేశవప్ప, వర్కర్ నాగేంద్రలపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని సీపీఐ తాలూకా కార్యదర్శి పవిత్ర డిమాండ్ చేశారు. శత్రుసింహను వర్కర్ నాగేంద్ర చంపదెబ్బ కొట్టడంపై ఆమెస్పందించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.